ఈనాడు కాకినాడ

శనివారం అక్టోబరు 19, 2024 15



చిరుతలై కదిలి..

కాకినాడ నగరంలో శుక్రవారం 68వ అంతర జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. అండర్-11, 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల నుంచి దాదాపు 400 మంది క్రీడాకారులు హాజరయ్యారు. స్కేటింగ్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు వీరు. -న్యూస్‌టుడే, మసీదు సెంటర్

ఏలేరుకు జలతాకిడి

ఎగువనుంచి 1800 క్యూసెక్కుల వంతున చేరిక

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: పరివాహక ప్రదేశం నుంచి ఏలేశ్వరంలోని ఏలేరు జలాశయానికి శుక్రవారం 1800 క్యూసెక్కుల వంతున నీరు చేరుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 86.56 మీటర్లు (24.11 టీఎంసీలు). ప్రస్తుతం 85.60 మీటర్ల స్థాయిలో 22.16 టీఎంసీల జలాలు ఉన్నాయని జేఈ భగవతి తెలిపారు. జలాశయం నుంచి ఏడమ ప్రధాన కాలువ ద్వారా విశాఖ అవసరాలకు 200 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. సాగుకు డీసీఆర్ స్లూయిస్ నుంచి 600 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ఒక గేటు ఎత్తి 1000 క్యూసెక్కులను అదనపు జలాలుగా దిగువకు విడిచిపెడుతున్నట్లు తెలిపారు.

మనకూ ఉంది డ్రోనాస్త్రం



ఈనాడు, రాజమహేంద్రవరం: **వరద నష్టం..నేర ఛేదన.. మందుల పిచికారీ.. ఆక్రమణల గుర్తింపు, రాత్రి గస్తీ.. ఇలా డ్రోన్‌లు చక్కబెట్టే పనులెన్నో. మన ఉమ్మడి జిల్లాలోనూ డ్రోన్లను పలు శాఖలు వాడుతున్నాయి. 22, 23 తేదీల్లో అమరావతిలో డ్రోన్ సమ్మిట్ జరగనుండటంతో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో మనవద్ద డ్రోన్‌ల పాత్ర ఎలా ఉందో పరిశీలిస్తే..**

- తూర్పులో రాత్రి గస్తీలోనూ వినియోగం
- కోనసీమలో సిద్ధమవుతోన్న డ్రోన్ పైలట్లు

సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా

తూర్పుగోదావరి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం నాలుగు డ్రోన్లు పనిచేస్తున్నాయి. పండగలు, రద్దీ వేళల్లో పరిస్థితిని చిత్రీకరిస్తూ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా పర్యవేక్షిస్తూ ఎస్పీ నరసింహకిశోర్ సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. దసరా ఉత్సవాలు, గోదావరి వరదలు, ఇటీవల కొవ్వూరులో ఉద్రిక్త వాతావరణం నెలకొన్న సమయంలో విస్తృతంగా డ్రోన్లు వినియోగించారు. రాత్రివేళల్లో సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా ఉంచి ఎక్కడ అవాంఛనీయ ఘటనలు, నేరాలు చోటుచేసుకున్నా.. అనుమానిత వ్యక్తులు తిరుగుతున్నా సమీప గస్తీ సిబ్బందిని అప్రమత్తం చేసేలా వ్యవస్థ ఏర్పాటుచేశారు. డ్రోన్ల నిర్వహణపై ఇటీవల 15 మంది సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. మరో 10 డ్రోన్ల కోసం ప్రభుత్వానికి నివేదించారు.



రాజమహేంద్రవరంలో పోలీసు సిబ్బందికి శిక్షణ

ఆక్రమణల పనిపట్టేలా..

కౌలువల ఆక్రమణలు గుర్తించేందుకు డ్రోన్ కార్పొరేషన్ నుంచి డ్రోన్లను అద్దెకు తీసుకుని తూర్పుగోదావరి కలెక్టర్ ప్రశాంతి సర్వేలు చేయించారు. కొవ్వాడ, ఎర్ర, బురద కాలువల కబ్జాలు.. గండ్లు కొట్టిన, నిర్మాణాలు దెబ్బతిన్న ప్రాంతాలను డ్రోన్లతో గుర్తించి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో రెండు డ్రోన్లతో వార్డుల్లో తనిఖీల ప్రక్రియకు కమిషనర్ కేతన్ గర్గ్ శ్రీకారం చుట్టారు. వీధుల్లో వ్యర్థాలు, పూడిక తీయని కాలువలను గుర్తిస్తున్నారు.



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో డ్రోన్

100 మందితో ప్రత్యేక సైన్యం

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 100 మంది గ్రామ సర్వేయర్లకు డ్రోన్‌ల నిర్వహణపై అమరావతిలో కలెక్టర్ మహేశ్‌కుమార్ శిక్షణ ఇప్పిస్తున్నారు. డ్రోన్ కార్పొరేషన్ సహకారంతో ఇప్పటికే 30 మంది తర్ఫీదు పొందారు. నెలాఖరుకు అందరికీ పూర్తిచేసి డ్రోన్ పైలట్లతో సైన్యాన్ని సిద్ధం చేస్తున్నారు. అక్రమ ఆక్వా సాగు, కాలువల కబ్జాలు, వరదల అంచనా, రైల్వే లైనుకు భూసేకరణ, ఇసుక తరలింపు పర్యవేక్షణకు ఈ సైన్యాన్ని వినియోగిస్తారు. ఇప్పటికే రైల్వేలైన్ భూసేకరణకు సంబంధించి భట్నవిల్లి-పేరూరు మధ్య ఉన్న నిర్మాణాలను డ్రోన్లతో గుర్తించారు.



ఏలేరు వరద సమయంలో పరిస్థితిని డ్రోన్‌లో చిత్రీకరించారిలా..

ఏలేరు వరద నష్ట నివారణలో కీలకపాత్ర

ఇటీవల ఏలేరు వరదల సమయంలో ప్రాణ, ఆస్తి నష్టాల నివారణలో డ్రోన్లు కీలకపాత్ర పోషించాయి. మొత్తం 8 డ్రోన్లతో ప్రభావిత ప్రాంతాలను జల్లెడ పట్టేలా కలెక్టర్ షాన్‌మోహన్ చర్యలు చేపట్టారు. ఏటిగట్లు బలహీనంగా ఉన్నచోట ఇసుక బస్తాలతో పటిష్ఠం చేస్తూనే, గ్రామాల్లోకి నీరు పోటెత్తకుండా 72 ప్రాంతాల్లో గండ్లు కొట్టించారు. 9 మండలాల పరిధిలో 114 ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నారు.

సౌర రథానికి.. సారథులేరీ!



ఈనాడు, కాకినాడ: సూర్య కాంతి నుంచి విద్యుత్తును తయారుచేసుకోవడం మానవాళికి క్షేమదాయకమని ప్రపంచ దేశాలు కోడై కూస్తున్నాయి. ఆ దిశగా చైతన్యం మాత్రం మన వద్ద కొరవడుతోంది. పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (నెడ్‌క్యాప్)ను గత వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. రాయితీల ఊతం ఇవ్వలేదు సరి కదా.. ఆ శాఖను పర్యవేక్షించాల్సిన నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ల పోస్టులు ఖాళీ అయినా భర్తీకి కనీస చొరవచూపలేదు.

అన్ని జిల్లాల్లోనూ మేనేజర్ల పోస్టులు ఖాళీ



కాకినాడలోని నెడ్‌క్యాప్ కార్యాలయం

గతంలోనే ఉద్యోగ విరమణ చేసినా..

కాకినాడ, తూర్పుగోదావరి, అంబేడ్కర్ కోనసీమ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు నెడ్‌క్యాప్ శాఖలో జిల్లా మేనేజర్లు లేరు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ పోస్టులు ఖాళీ అయినా పట్టించుకోలేదు. దీంతో ఇదే కార్యాలయంలోని అభివృద్ధి అధికారులు ఇక్కడ పాలన వ్యవహారాలు చూస్తున్నారు. నాలుగు జిల్లాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరించే కాకినాడ జిల్లా మేనేజర్ సత్యనారాయణ 2023 ఆగస్టులో పదవీవిరమణ చేశారు. అప్పట్నుంచి ఈ శాఖకు సారథులే లేరు. శ్రీకాకుళం నుంచి ఎన్టీఆర్ జిల్లా వరకు నెడ్‌క్యాప్ జిల్లా మేనేజర్ల పరిస్థితి పరిశీలిస్తే.. ఒక్క ఎన్టీఆర్ జిల్లాలోనే ఉన్నారు. వైకాపా ప్రభుత్వంలోనే పలువురు ఉద్యోగవిరమణ చేశారు. విశ్రాంత ఉద్యోగులు ఒప్పంద పద్ధతిలోనైనా తమను మళ్లీ జిల్లా మేనేజర్లుగా నియమించాలని అప్పటి ప్రభుత్వాన్ని కోరినా ఉలుకూ పలుకూ లేదు. దీనికితోడు నెడ్‌క్యాప్ పాలసీలు, ప్రోత్సాహం కనీసం కేంద్రం ఇచ్చే రాయితీ కరవవడం.. సౌర పంపుసెట్ల పథకాన్ని సద్వినియోగం చేసుకునే పరిస్థితి లేక వ్యవస్థ గతితప్పింది.

పంచాయతీరాజ్, జలవనరులశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్యారోగ్య, మున్సిపాలిటీలు, రెవెన్యూ ఇలా 37 కీలక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల విద్యుత్తు బకాయిలు రూ.861.54 కోట్లు ఉన్నాయి. బిల్లులు చెల్లించడానికి నిధుల్లేక కొన్ని శాఖలు చేతులెత్తేసే పరిస్థితి.. దీనిని అధిగమించాలంటే సౌర విద్యుత్తే శరణ్యం.

కార్యాలయాలకు భారం తగ్గాలంటే..

గత ప్రభుత్వంలో నిర్వీర్యమైన నెడ్‌క్యాప్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో కదలిక వచ్చినట్లయ్యింది. సౌర విద్యుత్తు దిశగా ప్రోత్సాహానికి అడుగులు వేయడంతో నెడ్‌క్యాప్‌కు ఊపిరి వచ్చింది. ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్‌టాప్ సౌర విద్యుత్తుకు గత నెల నుంచి సర్వే చేస్తున్నారు. ఇది సాకారమైతే.. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్తు భారం రూ.కోట్లలో తగ్గినట్లే. ప్రభుత్వ ఉద్యోగులకు విద్యుత్తు ద్విచక్ర వాహనాలంటూ గత ప్రభుత్వం హడావుడి చేసి రకరకాల ప్రణాళికలు తెచ్చినా.. పట్టాలెక్కించలేకపోయింది. ఈ తరహా వాహనాల కొనుగోలును ప్రోత్సహిస్తే ఇంధన ఖర్చులు, కాలుష్యం తగ్గే వీలుంది. రాజమహేంద్రవరంలో ఆటోలకు రెట్రోఫిట్ చేసి ఇంధన ఖర్చులు తగ్గిస్తామని గతంలో సర్వేచేసినా.. తర్వాత ఆ జాడ లేదు. ఇవన్నీ కార్యరూపం దాల్చాలి. ఇంధన భారం, కాలుష్యం పెరిగి.. జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్న నేపథ్యంలో సరైన ప్రోత్సాహం అందించాల్సి ఉంది.

నగర దారులు.. నరకకూపాలు



శాంతినగర్ మూడో వీధిలో ప్రమాదకరంగా రహదారి..

గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాకినాడ నగరంలోని రహదారులు పూర్తిగా రూపురేఖలు కోల్పోయాయి. పెద్ద గుంతలు, కంకర తేలి ప్రమాదకరంగా మారాయి. శ్రీనగర్, నాగమల్లితోటలో ఆశ్రమ్ పాఠశాలకు ఆనుకొని ఉన్న రహదారి, మున్సిబ్ కూడలి నుంచి అన్నమ్మగాటి కూడలి వెళ్లే మార్గం, శాంతినగర్ నారాయణ కళాశాల దగ్గర, నాగమల్లితోట కూడలి నుంచి ఎన్ఎఫ్‌సీఎల్‌కు వెళ్లే మార్గాల్లో భారీ సంఖ్యలో గుంతలు ఉన్నాయి. వీటిపై ప్రయాణాలు చేయాలంటే వాహనదారులు బెంబేలెత్తుతున్నారు. ఉన్నతాధికారులు సత్వరం స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. **-ఈనాడు, కాకినాడ**



మున్సిబ్ కూడలి నుంచి అన్నమ్మగాటి కూడలికి వెళ్లే దారి ఇలా..

21 నుంచి వాడపల్లిలో ఆర్జిత సేవలు రద్దు

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 21 నుంచి 29 వరకు అష్టోత్తర పూజలు, నిత్యకల్యాణం, ఇతర ఆర్జిత సేవలన్నీ రద్దు చేస్తున్నట్లు దేవస్థానం ఈవో ఎన్. సూర్యచక్రధరరావు తెలిపారు. మళ్లీ ఈనెల 30వ తేదీ నుంచి ఆర్జిత సేవలు యథావిధిగా నిర్వహిస్తామన్నారు. ఇతర వివరాలకు భక్తులు 08855-271888 ఫోన్ నంబరులో సంప్రదించాలని కోరారు.

'అల'జడి..!



బీచ్‌రోడ్డులో వంతెనపైకి దూసుకొస్తున్న అలలు

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఏర్పడిన తుపాను తీరం దాటినా కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ వద్ద సముద్రం అలజడి తగ్గలేదు. వరుసగా మూడో రోజు భారీ అలలు ఎగసిపడుతూ తీర ప్రాంత ప్రజలను భయాందోళనకు గురిచేశాయి. ఉప్పాడ, సూరాడపేట, జగ్గరాజుపేట, మాయాపట్నం, కోనపాపపేట గ్రామాలపై కెరటాలు విధ్వంసం సృష్టించాయి. నివాసితులు ఇళ్లు ఖాళీ చేసి వేరే ప్రాంతాలకు వెళ్లిపోయారు. ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డు ఛిద్రమైంది. ఎస్ఈజెడ్ పరిశ్రమ సమీపంలో వంతెనపైనుంచి సముద్రం నీరు ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు సమస్య తలెత్తింది. సాయంత్రం నుంచి సముద్రం శాంతించడం ఊరట కలిగించింది. **- న్యూస్‌టుడే, కొత్తపల్లి**



ఉప్పాడ బీచ్‌రోడ్డులో ప్రయాణికులపై ఎగసిపడుతున్న అలలు

'జల'మడి..!



వర్షం కురిసిన ప్రతిసారీ కరప మండల పరిషత్తు కార్యాలయాన్ని నీరు చుట్టుముడుతుంది. ఆవరణ లోతట్టుగా ఉండడంతో కొద్దిపాటి వర్షానికే నీరుచేరి ఆవరణ వరిమడిలా మారిపోతుంది. ఇదే ఆవరణలో గృహనిర్మాణశాఖ, ఉపాధి హామీ పథకం కార్యాలయాలు కూడా ఉండడంతో నిత్యం అనేక మంది వచ్చివెళ్తుంటారు. వృద్ధులు, మహిళలు మోకాళ్లలోతు నీటిలోంచి నడిచేందుకు భయాందోళన చెందుతున్నారు. శుక్రవారం మండల పరిషత్తు కార్యాలయంలోకి వెళ్లేందుకు పలువురు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. సమస్యపై ఎంపీడీవో అనుపమ వద్ద ప్రస్తావించగా మోటార్లు ఏర్పాటు చేయించి నీటిని తోడిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కరప**

కేంద్ర బీమా పథకాలు వర్తింపజేయాలి

కాకినాడ కలెక్టరేట్: జన సురక్ష కార్యక్రమాల ద్వారా రాబోయే మూడు నెలలు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలకు అర్హులను నమోదు చేయాలని కలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమాల వివరాలతో కూడిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం జీవన్‌జ్యోతి, పీఎం సురక్ష బీమా యోజన పథకాలపై గ్రామస్థాయిలో సదస్సులు, అవగాహన కల్పించి, నమోదు చేయాలన్నారు. ఏడాదికి రూ.436 ప్రీమియంతో జీవిత బీమా, రూ.20 ప్రీమియంతో ప్రమాద బీమా కింద రూ.2లక్షలు ఇవ్వనున్నారని తెలిపారు. జిల్లా లీడ్‌బ్యాంకు భాగస్వామ్యంతో కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. ప్రతి శుక్రవారం ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలన్నారు. జేసీ రాహుల్‌మీనా, శిక్షణా కలెక్టర్ హెచ్ఎస్ భావన, ఎల్‌డీఎం సీహెచ్ఎస్‌వీ ప్రసాద్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, హౌసింగ్ పీడీ ఎన్‌వీవీ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్, అధికారులు

టెట్‌కు 1,121 మంది హాజరు

సాంబమూర్తినగర్(కాకినాడ): జిల్లాలో శుక్రవారం జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు 1,121 మంది హాజరయ్యారు. నాలుగు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 1,333 మంది హాజరు కావాల్సి ఉండగా 212 మంది గైర్హాజరు అయినట్లు డీఈవో పి.రమేష్ తెలిపారు. ఉదయం పరీక్షలో 588 మంది, మధ్యాహ్నం పరీక్షలో 533 మంది హాజరయ్యారు.

యూజర్ ఛార్జీలు మింగేశారు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరపాలక సంస్థలో యూజర్ ఛార్జీల (చెత్త సేకరణ పన్ను) అక్రమ వసూళ్ల బాగోతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వాణిజ్య, వ్యాపార సంస్థలను లక్ష్యంగా చేసుకుని కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు జేబులు నింపుకొన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి నగరపాలక సంస్థలో చెత్త సేకరణ పన్ను వసూలు నిలిపివేశారు. వైకాపాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఎన్నికల్లో లబ్ధికోసం రెసిడెన్షియల్, కమర్షియల్ యూజర్ ఛార్జీల వసూలు ఆపేశారు. కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు కుమ్మక్కై యథావిధిగా వసూలు చేశారు. వివరాలు యాప్‌లో నమోదు చేయకుండా, ఆదాయాన్ని కార్పొరేషన్‌కు జమ చేయకుండా, సొంతంగా రసీదులు సృష్టించారు. ట్రేడ్ లైసెన్స్‌ల్లోనూ చేతివాటం ప్రదర్శించారు.

కొందరు శానిటరీ ఇన్‌స్పెక్టర్ల చేతివాటం

33, 34, 35 డివిజన్ల పరిధిలోకి వచ్చే 10వ శానిటేషన్ సర్కిల్‌లో ఎక్కువగా అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ పరిధిలో సినిమారోడ్డు, మెయిన్‌రోడ్డు వంటి కీలక ప్రాంతాలున్నాయి. ఇక్కడ వాణిజ్య, వ్యాపార సంస్థలు నెలకు రూ.1000 నుంచి రూ.10 వేలు చెల్లిస్తున్నాయి. ఇక్కడ 803 కమర్షియల్ అసెస్‌మెంట్స్ ఉన్నాయి. నెలకు రూ.2.60లక్షల చొప్పున జనవరి నుంచి సెప్టెంబరు వరకు సుమారు రూ.30 లక్షలు అనధికారికంగా యూజర్ ఛార్జీలు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ● 2, 8, 11, 12వ శానిటేషన్ సర్కిళ్ల పరిధిలోని బాలాజీచెరువు, దేవాలయం వీధి, రామారావుపేట, గాంధీనగర్, భానుగుడి కూడలి నుంచి నాగమల్లితోట కూడలి వరకు కీలక వ్యాపార, వాణిజ్య సంస్థలు, ఆసుపత్రులు, హోటళ్లు ఉన్నాయి. అన్ని చోట్లా అదే పరిస్థితి.

ఈ ప్రాంతాల్లో అధికంగా వసూలు..



వాణిజ్య సముదాయాల నుంచి చెత్త సేకరణ

డొంక కదిలిందిలా..

నగరపాలక సంస్థ పరిధిలో ప్రతీనెలా రూ.72లక్షలు వసూలవుతాయి. అందులో 40 శాతం కమర్షియల్ అసెస్‌మెంట్స్ నుంచి వస్తుంది. సాధారణంగా యాప్ ద్వారా మాత్రమే చెల్లించాలి. లేదంటే పాత మున్సిపల్ కార్యాలయంలోని కేంద్రంలో చెల్లించి పత్రం తీసుకోవాలి. అలా కాకుండా కొందరు అధికారులు, సిబ్బంది కుమ్మక్కై ఆసుపత్రులు, హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థల నుంచి తొమ్మిది నెలల కాలంలో రూ.కోటి వరకు వసూలు చేసి నొక్కేశారు. సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనాకు ఫిర్యాదు అందడంతో అక్రమాల డొంక కదులుతోంది.

విచారణ చేయిస్తాం..


అనధికారికంగా యూజర్ ఛార్జీల వసూళ్ల వ్యవహారం మా దృష్టికి వచ్చింది. సమగ్ర విచారణ చేయిస్తాం. అక్రమాలకు పాల్పడిన వారిని విడిచిపెట్టం. నగరపాలక సంస్థ ఆదాయానికి గండికొట్టే పనులను ఉపేక్షించేదిలేదు. కొన్ని నెలలుగా అన్ని అసెస్‌మెంట్స్ నుంచి యూజర్ ఛార్జీల వసూళ్లు నిలిపేశాం.

- డాక్టర్ డి.పృథ్వీచరణ్, ఎంహెచ్‌వో, కాకినాడ నగరపాలక సంస్థ

కొండపై దళారీ దందా

కలకలం రేపిన నకిలీ రసీదు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం శ్రీసత్యదేవుని దేవస్థానంలో వసతిగదులు దక్కించుకోవడానికి దళారుల దందా అధికమవుతోంది. అధికారులు ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నా, నిబంధనల్లో మార్పులు చేస్తున్నా అరికట్టలేకపోతున్నారు. దళారులు కొండపైనే తిష్టవేసి 'కొందరి' సహకారంతో అడ్డగోలుగా గదులు పొంది భక్తులకు అధిక సొమ్ముకు ఇస్తున్నారని తెలుస్తోంది. వసతిగదుల కోసం నకిలీ రసీదుతో బుధవారం ఓ వ్యక్తి ఆలయానికి రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంలో ఎవరి పాత్ర ఉంది. ఇంకేమైనా మోసాలకు పాల్పడ్డారా. ఎవరు సహకరిస్తున్నారనే చర్చ జోరుగా సాగుతోంది. మరోవైపు గదుల కేటాయింపులో కూడా గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో భక్తులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



ఇక్కడ లేవు.. అక్కడికెళ్లండి..

దేవస్థానానికి ఇటీవల ఓ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వచ్చారు. గది కోసం ఓ వసతి సముదాయానికి వెళ్లగా ఇక్కడ లేవు అక్కడకు వెళ్లండని సిబ్బంది సూచించారు. అక్కడికి వెళ్తే అక్కడా లేవు. మరోచోటుకు వెళ్లాలని సిబ్బంది సూచించారు. దీంతో ఆ భక్తుడు తీవ్ర ఇబ్బందిపడ్డారు. గదుల కేటాయింపులో సరైన ప్రణాళిక లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయంలోనే గదులు కేటాయించేవారు. అలా కాకుండా వసతి సముదాయాల వద్దే గదులు కేటాయించేలా గతంలో ఈవో ఆదేశాలు జారీచేశారు. భక్తులకు ఇబ్బంది ఎదురవుతుండటంతో సీఆర్వోలోనే గదులను కేటాయించాలని, వసతి సముదాయాల వద్ద భక్తులు రుసుం చెల్లించడం, అడ్వాన్సుగా చెల్లించిన సొమ్ము తిరిగి భక్తులకు ఇచ్చేలా సాఫ్ట్‌వేరు మార్చాలని ప్రస్తుత ఈవో ఆదేశించినా ఇంకా కార్యరూపంలోకి రాలేదు. ఇదే అవకాశంగా దళారులు రెండుచేతులా సొమ్ము చేసుకుంటున్నారు. సిబ్బందిలో కొందరు కొద్ది గంటల పాటు భక్తులకు అనధికారికంగా గదులు ఇచ్చి సొమ్ము వసూలు చేస్తున్నారని సమాచారం. ప్రస్తుత విధానంతో గదులు ఎక్కడ ఖాళీ ఉన్నాయి, ఎక్కడికి వెళ్లాలనే విషయంపై భక్తులకు స్పష్టత ఉండటంలేదు. గదుల ఖాళీల వివరాలు ప్రదర్శించే బోర్డులున్నా చాలా సందర్భాల్లో అవి పనిచేయడం లేదు. ప్రస్తుతం బయోమెట్రిక్ విధానంలో భక్తుల ఆధార్‌కార్డు నకలు తీసుకుని ఫోన్ నంబరు నమోదుచేసి భక్తుల ఫొటోలు తీసుకుని గదులు కేటాయిస్తున్నారు. రద్దీ రోజుల్లో అధిక సంఖ్యలో ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలతో ఎక్కువ మంది వస్తుంటారు. ఇటీవల దాదాపు 150 నుంచి 200 గదుల కోసం సుమారు 20 మంది ప్రజాప్రతినిధుల నుంచి లేఖలు వచ్చాయి. ఆయా లేఖల్లో కూడా దళారుల పాత్ర స్పష్టంగా కనిపిస్తోంది. నకిలీ రసీదు బయటపడిన నేపథ్యంలో సిఫార్సు లేఖల విషయంలో అధికారులు స్పష్టంగా పరిశీలన చేయాల్సి ఉంది.

వైకాపా నేతల దాడిలో కన్ను కోల్పోయిన తెదేపా కార్యకర్త

మసీదు సెంటర్(కాకినాడ), న్యూస్‌టుడే: వైకాపా నేతల దాడిలో ఓ తెదేపా కార్యకర్త కుడి కన్ను కోల్పోయారు. వివరాల్లోకి వెళ్తే.. ఈనెల 15న కాకినాడ దుమ్ములపేటలో అదే ప్రాంతానికి చెందిన తెదేపా సోషల్ మీడియా ప్రతినిధి సీరం చిన్న, తాతారావులపై వైకాపా నాయకులు మారణాయుధాలతో దాడి చేసిన సంగతి తెలిసిందే. తీవ్రంగా గాయపడిన చిన్నాను కాకినాడలోని జీజీహెచ్‌కు తరలించారు. అతని కంటిపై బలంగా దెబ్బలు తగలడంతో కుడి కన్ను తెరవలేని పరిస్థితి నెలకొంది. పరీక్షల అనంతరం కంటి లోపల రక్తం గడ్డ కట్టినట్లు గుర్తించారు. సంబంధిత నేత్ర నిపుణుడు ఇక్కడ లేకపోవడంతో విశాఖపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఆ మేరకు కుటుంబసభ్యులు చిన్నాను 17న విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి కుడి కన్ను చూపు పూర్తిగా పోయిందని నిర్ధారించారు. అనంతరం ఎడమ కన్నుకు ఇన్‌ఫెక్షన్ సోకకుండా కుడికంటి నరాలు తొలగించారు. ఇలా ఉండగా దాడికి పాల్పడిన వైకాపా నాయకులు పేర్ల దుర్గారావు, దాసరి సతీష్, పేర్ల వెంకటేష్, తిరుదు నూకరాజు, వంశీ తదితరులను నేటికీ పోలీసులు అదుపులోకి తీసుకోకపోవడం గమనార్హం. దీనిపై పోర్టు సీఐ సునీల్‌కుమార్‌ను వివరణ కోరగా నిందితులు పరారీలో ఉన్నారన్నారు. వారి కోసం గాలిస్తున్నామని అన్నారు.



చికిత్స పొందుతున్న సీరం చిన్న

వినతులపై సానుకూల దృక్పథం అవసరం

కాకినాడ కలెక్టరేట్: ప్రజా విజ్ఞాపనలపై సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు వస్తున్న అర్జీలపై అన్నిశాఖల అధికారులతో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. అర్జీదారుల సంతృప్తే లక్ష్యంగా పనిచేయాలన్నారు. ప్రతి 15 రోజులకు సమీక్షిస్తామన్నారు. ఇప్పటి వరకు వచ్చిన అర్జీలు, పరిష్కారం, కాని వాటికి కారణాలపై ఆరా తీశారు. గృహ నిర్మాణం, జాతీయ ఉపాధి హామీ పథకంపై సమీక్షించారు. స్మశాన వాటికలు, డంపింగ్‌యార్డులకు భూసేకరణపై చర్చించారు. పరిశ్రమలకు అవసరమైన భూముల గుర్తింపుపై దృష్టి సారించాలన్నారు. జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో డి.తిప్పేనాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చూసిన కనులదే భాగ్యం



అన్నవరం దేవస్థానం అనివేటి మండపంలోని ధ్వజస్తంభానికి స్వర్ణ కలశాలు, సుదర్శన చక్రం బిగింపు వీక్షించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దాత సహకారంతో నూతన ధ్వజస్తంభానికి బంగారు తాపడంతో ఆధునీకరణ సిద్ధం చేశారు. వైశాఖ స్తులో స్వామి, అమ్మవారు, పరమేశ్వరుల మూలవిరాట్ దర్శనం తర్వాత దిగువ అంతస్తులో యంత్రాలయం దర్శనానికి భక్తులు వస్తారు. అనివేటి మండపంలో ధ్వజస్తంభం మట్టు ప్రదక్షిణ చేసే సమయంలో పైన స్వర్ణ కలశాలు, సుదర్శన చక్రం కూడా వీక్షించేలా తాజాగా అద్దం ఏర్పాటుచేశారు. పై నుంచి వర్షం నీరు కిందకు రాకుండా ఈ అద్దం ఉపయోగపడనుందని అధికారులు చెబుతున్నారు.

- న్యూస్‌టుడే, అన్నవరం

మరిడమ్మకు ప్రత్యేక పూజలు

పెద్దాపురం, న్యూస్‌టుడే: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారిని శుక్రవారం సాయంత్రం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.రాధాకృష్ణ కృపాసాగర్, గుంటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి బీవీఎల్ సత్యవతి దర్శించుకున్నారు. వీరికి వేదపండితులు, ఆసాదులు మంగళ స్వాగతం పలికారు. వారితో పాటు పెద్దాపురం ఏడవ అదనపు జిల్లా జడ్జి చంద్రమౌళీశ్వరి, సీనియర్ సివిల్ జడ్జి దీప్తి ప్రవల్లిక, మున్సిఫ్ మెజిస్ట్రేట్ జి.బుల్లెమ్మ దర్శించుకున్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవర సుబ్రహ్మణ్యం(మణి), సభ్యులు మడికి రాంబాబు, విశాలాక్షి, పిట్ల రమణ, దేవాలయ సహాయ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రాధాకృష్ణ కృపాసాగర్, గుంటూరు రెండో అదనపు జిల్లా జడ్జి సత్యవతి

సామర్లకోట రైల్వేస్టేషన్‌కు స్వచ్ఛభారత్ పురస్కారం

సామర్లకోట: సామర్లకోట రైల్వేస్టేషన్‌కు స్వచ్ఛభారత్ పురస్కారం దక్కింది. శుక్రవారం విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పురస్కారం అందించారు. ఇటీవల రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన స్వచ్ఛభారత్, స్వచ్ఛతా హీ సేవా, స్వచ్ఛత పఖ్వాడా కార్యక్రమాలను డీఆర్ఎం చేతుల మీదుగా సామర్లకోట రైల్వేస్టేషన్ చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కల్యాణ్ పురస్కారం అందుకున్నారు. ఆయనను స్టేషన్ మేనేజర్ రమేష్ తదితరులు అభినందించారు.



ఐటీఐలు.. నైపుణ్య కేంద్రాలు

ఆధునిక వసతుల కల్పనకు ప్రభుత్వ చర్యలు

గత ఐదేళ్లతో పోలిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల కాలంలోనే ఐటీఐలకు డిమాండ్ పెరిగింది. గతంలో ప్రభుత్వ ఐటీఐల్లో సైతం సీట్లు భర్తీ కాకపోగా ప్రైవేటులో 50-60 శాతం మాత్రమే భర్తీ అయ్యేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, ఉద్యోగ కల్పనకు ప్రాధాన్యమివ్వడంతో వీటిలో చేరే వారిసంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికితోడు నూతన కోర్సులను ప్రవేశపెట్టేందుకు అడుగులు వేస్తుండటంతో ఉపాధి కేంద్రాలుగా మార్చాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది.

- న్యూస్‌టుడే, గాంధీనగర్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యోగ కల్పన విభాగం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించడం మొదలుపెట్టారు. దీంతో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో ఐటీఐల్లో చదివిన విద్యార్థులు 75 శాతం మందికి ఎల్అండ్‌టీ బెంగళూరు, చెన్నై, ఐటీసీ, సుజుకీ ఏరోస్పేస్ వంటి ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలు లభించాయి. మిగిలిన 25 శాతం మందిలో కొందరు బ్రిడ్జికోర్సు ద్వారా పాలిటెక్నిక్‌లో చేరగా, మరికొందరు ప్రభుత్వ కంపెనీల్లో అప్రెంటిస్ కోసం వెళ్లారు. మరికొందరు స్వయం ఉపాధి దిశగా అడుగులు వేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలిలా..

జిల్లా	ఐటీఐలు	సీట్లు	భర్తీ శాతం
కాకినాడ	ప్రభుత్వ-2	684	99.4
	ప్రయివేట్-12	1448	85
కోనసీమ	ప్రయివేట్-15	2236	80
తూర్పుగోదావరి	ప్రయివేట్-12	1340	86
	ప్రభుత్వ-1	132	100



టర్నర్ ట్రేడ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో రూ.1.93 కోట్లతో స్ట్రైవ్ ప్రాజెక్టు ద్వారా ట్రేడ్ అప్‌గ్రేడేషన్, మౌలిక వసతుల కల్పనకు నిధులు ఖర్చు చేస్తున్నారు. వీటితో కంపెనీలకు కావాల్సిన విధంగా యంత్ర సామగ్రి కొనుగోలు చేసి శిక్షణ ఇస్తున్నారు. దీనికితోడు ఏపీఎస్ఎస్‌డీసీ వారి స్కిల్‌హబ్ ద్వారా మల్టీస్కిల్‌లో భాగంగా మరొక ట్రేడ్‌లో మూడు నెలల శిక్షణ ఇస్తున్నారు. ఇద్దరూ రెగ్యులర్‌తో పాటు స్వల్పకాలిక కోర్సు ద్వారా మరిన్ని నైపుణ్యాలు పెంపొందేలా చేస్తున్నారు.

పరిశ్రమలతో అనుసంధానం..

నూతన విధానంలో భాగంగా విద్యార్థులకు స్థానిక కంపెనీలతో శిక్షణ ఇచ్చేలా చేస్తున్నారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ల్యాబ్‌లలో సౌకర్యాలు, యంత్రాలు సమకూరుస్తున్నారు. కోరమాండల్ కంపెనీ ఇన్‌స్ట్రుమెంట్ మెకానికల్ ల్యాబ్‌ను, వరుణ్ మోటార్స్ వారు మోటార్, డీజిల్ మెకానిక్‌లో ఎంవోయూ చేసుకొని శిక్షణ అందిస్తున్నారు.

నూతన కోర్సులకు శ్రీకారం

కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 13 కోర్సుల్లో 1,048 మంది శిక్షణ పొందుతున్నారు. వీటిలో రెండు సంవత్సరాల కోర్సులు 9, ఏడాది కోర్సులు 4 ఉన్నాయి. ప్రైవేట్ ఐటీఐల్లో సుమారు ఆరు కోర్సులను నిర్వహిస్తున్నారు. కొత్తగా డ్రోన్ టెక్నాలజీ, సోలార్ ఎలక్ట్రీషియన్ కోర్సులను రెండు మూడు నెలల్లో ప్రవేశపెట్టనున్నారు. ప్రస్తుతం వీటికి డిమాండ్ ఉండటంతో వీటి ద్వారా మరింత మంది నిపుణులను అందుబాటులో తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుంది. సీట్ల వివరాలు త్వరలో ప్రకటించనున్నారు.

ఉపాధి అవకాశాలు మెండు..

ఐటీఐ పూర్తిచేస్తే ఉపాధి అవకాశాలు బాగున్నాయి. ప్రభుత్వం నైపుణ్యత, ఉద్యోగ కల్పన లక్ష్యంగా పెట్టుకున్న నేపథ్యంలో గతంలో కంటే ఈ ఏడాది ప్రవేశాల సంఖ్య పెరిగింది. రెగ్యులర్ కోర్సులతో పాటు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు ప్రాధాన్యమిస్తుండటం, పరిశ్రమలతో ఎంవోయూలు కుదుర్చుకోవడం ద్వారా మెరుగైన నైపుణ్యాలను నేర్పించగలుగుతున్నాం.

- మంతెన వేణుగోపాలవర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల కన్వీనర్

విద్యుత్తు ఛార్జీల భారంపై ధర్నా



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు

కాకినాడ కలెక్టరేట్: విద్యుత్తు ఛార్జీల భారాలను ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏపీఈపీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేశారు. స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలన్నారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యుత్తు బిల్లులే కాకుండా ఫిక్స్‌డ్, కస్టమర్, సర్ ఛార్జీలు, విద్యుత్తు సుంకం, సర్దుబాటు ఛార్జీల పేరుతో భారం మోపుతున్నారన్నారు. గతంలో వినియోగించిన కరెంటుకు ఛార్జీలు చెల్లించాలనడం సమంజసం కాదన్నారు. స్మార్ట్‌మీటర్ల పేరుతో అదానికి దోచిపెట్టాలని చూస్తున్నారన్నారు. అనంతరం ఎస్ఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, దువ్వ శేషబాబ్జీ, కేఎస్ శ్రీనివాస్, తిరుమలశెట్టి నాగేశ్వరరావు, పలివెల వీరబాబు, సీహెచ్ రమణి, మలకా వెంకటరమణ, కె.వీరబాబు తదితరులు నాయకత్వం వహించారు.

పాఠశాలల అభివృద్ధికి ప్రాథమిక సర్వే

పిఠాపురం: పిఠాపురం నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రాథమిక సర్వే నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారని ఆయన కార్యాలయ అధికారి శివరామప్రసాద్ తెలిపారు. శుక్రవారం పిఠాపురంలోని బీఎంఆర్, ఆర్ఆర్‌బీహెచ్ఆర్, కొత్తపల్లిలోని పలు పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం పిఠాపురం మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈవోలతో సమీక్షించారు. నాడు-నేడు పనులపై ఆరా తీశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి పనులన్నీ పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలోని 52 పాఠశాలల్లో క్రీడా మైదానాలు, రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీరు, ఫర్నీచర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇక్కడి పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని పవన్‌కల్యాణ్ సూచించారని చెప్పారు. వసతిగృహాల్లో సౌకర్యాలపైకూడా దృష్టి సారించినట్లు చెప్పారు. ఎంఈవోలు జి.శ్యాంబాబు, శివప్రసాద్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఈవోలతో చర్చిస్తున్న శివరామప్రసాద్

ప్రోత్సహిస్తే మరిన్ని పతకాలు



మణికంఠ నవీన్

దేవీచౌక్(రాజమహేంద్రవరం): ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని పతకాలు సాధిస్తానని 2024 బయాత్లే/ట్రైథల్లే వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించిన భారత జట్టులో సభ్యుడు వరద మణికంఠ నవీన్ తెలిపాడు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ యానాంలోని నల్లం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న తాను అక్కడే ఉన్న ఓ అకాడమీలో స్విమ్మింగ్, రన్నింగ్, షూటింగ్‌లో శిక్షణ పొందానని వెల్లడించాడు. కోచ్ గ్రంధి రవితేజ ప్రోత్సాహంతో ఈజిప్టులోని పోర్టు సైడ్‌లో ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగిన యూఐపీఎం 2024 బయాత్లే/ట్రైథల్లే వరల్డ్ ఛాంపియన్ షిప్‌లో పాల్గొని అండర్-17 కేటగిరిలో తమ జట్టు కాంస్య పతకం సాధించడానికి దోహదపడ్డానన్నాడు. త్వరలో జరగబోయే ఏషియన్ గేమ్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనాలనేది తన కోరికని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని కోరాడు. ఈ సమావేశంలో నవీన్ తల్లిదండ్రులు ఈశ్వరరావు, హారిక పాల్గొన్నారు.

అట్టహాసంగా స్కేటింగ్ పోటీలు ప్రారంభం



జ్యోతితో స్కేటింగ్ చేస్తున్న క్రీడాకారులు

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: క్రీడాకారులు ఆత్మవిశ్వాసంతో పోటీల్లో పాల్గొనాలని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ పేర్కొన్నారు. విద్యాశాఖ, క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 68వ అంతర జిల్లాల రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కలెక్టర్, కాకినాడ గ్రామీణం ఎమ్మెల్యే పంతం నానాజీతో కలిసి కార్యక్రమం ప్రారంభించారు. డీఈవో పి రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ అండర్-11, 14, 17, 19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు జరుగుతున్నాయన్నారు. 13 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 400 మంది పాల్గొన్నారన్నారు. ఉత్తమ ప్రదర్శనతో ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. హరీష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తలాటం హరీష్, డీఎస్‌ఏ డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, ఎస్‌జీఎఫ్ అండర్-14, 17 జిల్లా కార్యదర్శి లంకా జార్జి, జిల్లా రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కోశాధికారి సీహెచ్ రమేష్, జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు వి.రవిరాజు, కె.నూకరాజు, పీఈటీలు రవిసుందర్, కౌర్, సుధాకర్, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి అంతర్ జిల్లా రైఫిల్ షూటింగ్ పోటీలు

రాజానగరం: రాజానగరం మండలంలోని సంపతనగరంలో గల రాజమహేంద్రి ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ నెల 19 నుంచి 21వ తేదీ వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్)ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించనున్నామని ఎస్‌జీఎఫ్ తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి శుక్రవారం తెలిపారు. పాఠశాల ఛైర్మన్ టి.కె. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి సుమారు వెయ్యి మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకానున్నారని తెలిపారు. వారందరికీ అవసరమైన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేశామన్నారు. శనివారం ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, డిఎస్ఈఓ వాసుదేవరావు తదితరులు పాల్గొంటారన్నారు.



క్రీడాకారుల సాధన

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

కాకినాడ కలెక్టరేట్: వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కలెక్టర్ షాన్‌మోహన్ సూచించారు. న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉల్లాస్ పథకంపై సమీక్షించారు. జిల్లాలో 6,806 మంది నిరక్షరాస్యులను గుర్తించాలని నిర్ణయించామన్నారు. దీనికి డ్వాక్రాసంఘాల సభ్యులు, అంగన్‌వాడీ ఆయాలు, ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది దృష్టిసారించాలన్నారు. ఈ నెల 24 నుంచి డీఆర్‌డీఏ సిబ్బందితో సర్వే చేపట్టాలన్నారు. వచ్చేనెల 5 నుంచి 2025 మార్చి వరకు శిక్షణ ఇస్తామన్నారు. మార్చిలో పరీక్ష నిర్వహించి, ఉత్తీర్ణత సాధించిన వారికి ఓపెన్ స్కూల్ ద్వారా ధ్రువపత్రం అందజేస్తామన్నారు. జేసీ రాహుల్‌మీనా, శిక్షణా కలెక్టర్ హెచ్ఎస్ భావన, వయోజన విద్య డీడీ పి.పోసయ్య, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీరమణి, డీఈవో రమేశ్, డీపీవో రవికుమార్, సమాచారశాఖ డీడీ డి.నాగార్జున పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు రూ.2,02,232 విరాళం

అయినవిల్లి న్యూస్‌టుడే: సిద్ధివినాయక స్వామి ఆలయంలో అన్నదాన ట్రస్ట్‌కు కాకినాడకు చెందిన నల్లం పరశురామ్ కుటుంబ సభ్యులు వారి తల్లిదండ్రులు నల్లం బాల కృష్ణారావు పేరున రూ. 1,01,116, లక్ష్మీనరసమ్మ పేరున రూ. 1,01,116 విరాళాన్ని ఈవో సత్యనారాయణ రాజుకు శుక్రవారం అందజేశారు. వారికి ఈవో స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు.



కిరాయి డ్రైవర్ గంజాయి స్మగ్లర్‌గా మారి..

పటమట, న్యూస్‌టుడే: అంతర్రాష్ట్ర ముఠా లోడ్ చేసిన తుపాకీ వెంట తెచ్చుకొని గంజాయి రవాణా చేస్తూ పోలీసులకు చిక్కింది. ఆ వివరాలను శుక్రవారం విజయవాడ పటమట పోలీస్ స్టేషన్‌లో డీసీపీ మహేశ్వరరాజు, సెంట్రల్‌జోన్ ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ మీడియాకు వెల్లడించారు. చెన్నై పద్మనాభనగర్‌కు చెందిన రమేష్ వినేష్‌కుమార్‌కు అదే నగరానికి చెందిన గంజాయి వ్యాపారి శ్రీనివాస్‌తో పరిచయం ఏర్పడింది. నర్సీపట్నానికి చెందిన గంజాయి వ్యాపారి దుర్గా నుంచి శ్రీనివాస్ సరకు తెప్పించి చెన్నైలో విక్రయిస్తుంటాడు. తుని నుంచి చెన్నైకి గంజాయి తీసుకెళ్తే... వినేష్‌కు రూ.25 వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. దుర్గా నర్సీపట్నంలో వినేష్ వాహనంలో సరకు ఎక్కించేవాడు. అలా పలుమార్లు గంజాయి తీసుకెళ్లాడు. గతేడాది పోలీసులకు దొరికాడు. దుర్గాతో పాటు వినేష్ జైలుశిక్ష అనుభవించాడు.

నంబర్ ప్లేట్లు మార్చి.. కిరాయి డ్రైవర్‌గా గంజాయి చేరవేసే కంటే తానే స్మగ్లింగ్ చేస్తే ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చనే ఆలోచనతో వినేష్ కారు కొన్నాడు. పలుమార్లు గంజాయి చెన్నైకి తీసుకెళ్లాడు. ఈ నెల 16న తమిళనాడుకు చెందిన కుమారన్ మరి మూర్తితో కలిసి చెన్నై నుంచి కారులో తుని వచ్చాడు. గురువారం దుర్గా తీసుకువచ్చిన 150 కిలోల గంజాయిని తన కారులో లోడ్ చేసుకున్నాడు. కారుకు ఏపీ నంబర్ ప్లేట్ అతికించాడు. విషయం తెలుసుకున్న కౌంటర్ ఇంటెలిజెన్స్ పోలీసులు విజయవాడ సీపీకి సమాచారం ఇచ్చారు. ఆయన ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. ఆ బృందం విజయవాడలో వాహనాన్ని పట్టుకొని సరకుతో పాటు లోడ్ చేసిన తుపాకీ స్వాధీనం చేసుకుంది.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	11,500
పాతకాయ: గండేరా	17,500
గటగట	15,500
కొత్తకాయ: గండేరా	16,500
గటగట	14,500
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	13,000-13,500
కొత్త (పచ్చి) కాయ	12,500-13,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	3,750
కిలో	260

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	130-00
రిటైల్ లైవ్	152-00
డ్రెస్డ్	220-00
స్కిన్‌లెస్	251-00

మంత్రి లోకేశ్ ఫ్లెక్సీ చించివేత

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో చలికి వీరేంద్ర అనే వ్యక్తి ఏర్పాటు చేసిన మంత్రి నారా లోకేశ్ ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చించేయడం కలకలం రేపింది. ఈ సందర్భంగా వీరేంద్ర శుక్రవారం మాట్లాడారు. స్థానిక చీడీలపొర ప్రాంతంలో తన భూమిపై పలువురు నకిలీ దస్త్రాలు సృష్టించి కాజేయాలని ప్రయత్నించారని, సమస్యను ప్రజా దర్బారులో మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. ఆధారాలన్నీ చూపించగా, భూమి సమస్య పరిష్కారమైందన్నారు. దీనికి కృతజ్ఞతగా ఫ్లెక్సీని ఏర్పాటు చేస్తే దాన్ని చించేశారని వాపోయారు. శుక్రవారం తెల్లవారుజామున జరిగినట్లు గుర్తించామన్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.



ఫోర్జరీ రసీదుపై ఫిర్యాదు

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానంలో వసతి గదుల కేటాయింపునకు సంబంధించి గుర్తించిన నకిలీ రసీదుపై విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సత్యగిరిపై హరిహర సదన్ వసతి సముదాయంలో నాలుగు గదులు ముందస్తు రిజర్వేషన్ చేయించుకున్నట్లు గురువారం ఓ వ్యక్తి నకిలీ రసీదును అధికారులకు చూపించిన విషయం విదితమే. అది నకిలీదని గుర్తించిన అధికారులు ఆ వ్యక్తిని ప్రశ్నించేందుకు ప్రయత్నించగా అప్పటికే ఆయన వెళ్లిపోయాడు. ఈ విషయాన్ని ఈవో రామచంద్ర మోహన్ తీవ్రంగా పరిగణించి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆ విభాగం అధికారులను ఆదేశించారు. రసీదును ఎవరు, ఎలా ఫోర్జరీ చేశారు. గతంలో ఓ భక్తుడి పేరిట ఇచ్చిన రసీదును సేకరించి అందులో వివరాలు ఎలా మార్పుచేశారు, అధికారులకు తలెత్తిన అనుమానాలు తదితర అంశాలతో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

★ For the Information of Trade & Industry

★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. **5-05** పై॥

అనపర్తి ఆఫీసు: 08857-226908

రైతుబజారులో నిన్నటి కూరగాయల ధరలు(కిలోకు)



గాంధీనగర్: టమాటా - 40, వంకాయలు - 40,54, బెండకాయలు - 30, పచ్చిమిర్చి - 40,58, కాకరకాయ - 30, బీర - 30,38, కాలీఫ్లవర్ - 15,20, క్యాబేజీ - 44, క్యారెట్ - 46,48, దొండకాయలు - 16, బంగాళాదుంపలు - 30,36, ఉల్లి - 34,45,50, గోరుచిక్కుళ్లు - 30, దోసకాయలు - 34, ఆనపకాయ - 30,35, పొట్లకాయ - 18,20, అరటికాయ - 6,7, చిక్కుళ్లు - 96, చేమదుంపలు - 46, మునగకాడలు - 8,10, బీట్‌రూట్ - 42, కీరదోస - 26, బీన్స్‌గింజలు - 130, అల్లం - 55, క్యాప్సికం - 100, బొబ్బర్లు - 56, చిలకడదుంపలు - 40, మామిడికాయ - 16,20, నిమ్మకాయలు(డజన్) - 24,48,54.

కాకినాడ

నగరంలో సినిమాలు గాంధీనగర్: ఆనంద్ సినిమాస్ 4(ప్లస్- విశ్వం, వెట్టయాన్ ది హంటర్, ఇద్దరు, జనక అయితేగనక, సత్యం సుందరం, దేవీ మల్టీప్లెక్స్ 4(ప్లస్- డిడెవిల్, విశ్వం, దేవర పార్ట్ 1, మానాన్న సూపర్‌హీరో, లక్ష్మీ- కల్యాణపొంగల్(ఉ.సా), ఇద్దరు(మ,రా), సత్య గౌరి- లవ్‌రెడ్డి, తిరుమల - వెట్టయాన్ ది హంటర్, సిఅండ్‌సీ 1- జనక అయితేగనక, సీఅండ్‌సీ 2- శ్వాగ్, శ్రీప్రియ - మార్టిన్, పద్మప్రియ- దేవర పార్ట్ 1, సూర్య1(వాకలపూడి) - దేవర పార్ట్ 1, సూర్య 2- జనక అయితేగనక(ఉ,సా)విశ్వం(మ,రా), శ్రీశ్రీనివాసా(వేళంగి)- వెట్టయాన్ ది హంటర్(ఉ.సా)విశ్వం(మ.రా).

మేమున్నాం.. మీకు తోడుగా

వెలగని వీధి దీపం..

సమస్య: ప్రతాప్‌నగర్ బాలయోగి వీధిలోని 64-16-1/5 డోరు నంబరు వద్ద వీధి దీపం చాలా రోజుల నుంచి వెలగట్లేదు. రాత్రి చీకటి కారణంగా ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు, ప్రతాప్‌నగర్

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపం వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - సాంబశివరావు, ఏఈ, నగరపాలకసంస్థ

ఖాళీ స్థలంలో వ్యర్థాలు..



సమస్య: కాకినాడ 30వ డివిజన్ దిగువ రైవారి వీధిలోని ఖాళీ స్థలంలో వ్యర్థాలు పేరుకుపోయి, దుర్వాసన వస్తోంది. చాలా కాలం నుంచి వాటిని తొలగించట్లేదు. వర్షం పడినప్పుడు అందులోని పురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయి. ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు, దిగువమర్రివారిపేట

సమాధానం: సిబ్బందిని పంపి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. -డా.పృథ్వీచరణ్, ఎంహెచ్‌ఓ, నగరపాలకసంస్థ

అస్తవ్యస్త పార్కింగ్..



ఆర్టీసీ బస్టాండును ఆనుకుని ఉన్న రైతుబజారులో అస్తవ్యస్త పార్కింగ్‌తో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దుకాణాలకు ఇరువైపులా సగానికి పైగా రోడ్డును ఆక్రమించి వాహనాలను పెడుతున్నారు. లోడు ఆటోలను అడ్డదిడ్డంగా పెట్టడంతో రైతు బజారుకు వచ్చేవారు, సమీప ప్రాంత నివాసితులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. చెత్తబుట్టలు సైతం రోడ్డుపైనే ఉంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. వాటిలోని వ్యర్థాలు పశువులు చిందర వందర చేస్తున్నాయి. దీనివల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబరు: 91548 46719

మొక్కలతోనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న సభ్యుడు

గాంధీనగర్, న్యూస్‌టుడే: వృక్ష సంపద ఆధారంగానే భవిష్యత్తులో మానవాళి మనుగడ ఆధారపడి ఉందని, మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టాలని లయన్స్‌క్లబ్ ఎలైట్ కాకినాడ అధ్యక్షుడు ఎన్ఎస్ఆర్‌వీ సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నాగమల్లితోట సమీపంలోని పార్కుతో పాటు, బొట్టీగర్ వద్ద లయన్స్ ఎలైట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. క్లబ్ అధ్యక్షుడు మాట్లాడుతూ భావితరాలకు ఆక్సిజన్ కొనే పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ ఇంటి ముందు మొక్క నాటాలన్నారు. పుట్టిన రోజున ప్రతి ఒక్కరూ మొక్క నాటాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు ఆదిత్య జన్మదినోత్సవం సందర్భంగా మొక్కలు నాటడం అభినందనీయమన్నారు. క్లబ్ కోశాధికారి సత్యనారాయణ, సత్తిరెడ్డి, రాఘవరావు, రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర సేద్యం.. అభ్యాస క్షేత్రం

న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్



నర్సరీలో మొక్కలు పరిశీలిస్తున్న విద్యార్థినులు

తరగతి గది పాఠాలకే పరిమితమైతే ఎలా..? క్షేత్ర స్థాయిలో నేర్చుకుంటేనే దానికి పూర్తి సార్థకత. అవగాహనతో కూడిన విద్యతోనే ఉన్నత భవిత ఉంటుంది. స్థానిక అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హార్టికల్చర్ చదువుతున్న విద్యార్థినులు నర్సరీల్లో, వ్యవసాయ క్షేత్రాల్లో పర్యటిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం, వివిధ రకాల పంటలు, పండ్లు, పూలు, ఇతర క్రోటాన్ మొక్కల గురించి తెలుసుకుంటున్నారు. ఎరువులు, పురుగు మందుల వాడకం ఎక్కువైన ఈ రోజుల్లో అందుకు భిన్నంగా ఆలోచిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో సాగు గురించి తెలుసుకుంటున్నారు. కళాశాల అధ్యాపకులు డా.ఎం.సులక్షణ, కేఎన్‌వీఎస్ఎన్ ఈశ్వరి, ఎన్.పుష్ప, జి.చందాని సారథ్యంలో చీడిగలోని గణపతి గార్డెన్స్, ఇతర నర్సరీల్లో గ్రాఫ్టింగ్, లేయరింగ్, కటింగ్, మట్టి పరీక్షలు, నీటి వాడకం, మందు పిచికారీ వంటి పలు అంశాలపై అవగాహన పెంచుకుంటున్నారు. అదే విధంగా నర్సరీల్లో హైబ్రిడ్ మొక్కల తయారీ, గ్రీన్ హౌస్, పాలిహౌస్ నిర్మాణాలపై మెలకువలు నేర్చుకున్నారు.

విత్తన శుద్ధితో మేలు..



క్షేత్రపర్యటనతో పలు అంశాలను నేర్చుకున్నాం. గతంలో రాజమహేంద్రవరం, కడియం తదితర ప్రాంతాల్లోని పలు నర్సరీలను సందర్శించాం. అక్కడి రైతులను కలిసి ఆర్కిడ్‌లు నేర్చుకున్నాం. నర్సరీ నిర్వాహకుడు మామిడి కాళీకిరణ్ మొక్కల పెంపకంతోపాటు పలు అంశాలపై అవగాహన కల్పించారు. విత్తన శుద్ధి, గ్రాఫ్టింగ్, లేయరింగ్ వంటివి నేర్చుకున్నాం. - హరీష

విజ్ఞానాన్ని పెంచేందుకు..

క్షేత్రస్థాయి పర్యటనలతో విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుంది. కళాశాలలో పాఠ్యాంశాల రూపంలో కాకుండా క్షేత్రస్థాయిలో నేర్చుకోవడం ద్వారా వారికి ఈ విధానాలపై సమగ్ర అవగాహన వస్తుంది. వీటిపై పూర్తిస్థాయిలో పట్టు సాధిస్తే వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. ఆసక్తి ఉన్నవారు సొంతంగా నర్సరీలు పెట్టుకోవచ్చు. ఆదాయ మార్గంపై కూడా విద్యార్థినుల్లో అవగాహన కల్పిస్తున్నాం.

- డాక్టర్ ఎం.సులక్షణ, అధ్యాపకురాలు

ఇంట్లోనూ పెంచుకోవచ్చు..



ప్రస్తుతం సాగులో అధిక మోతాదులో ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడడంతో భూసారం దెబ్బతింటోంది. దీనికి ప్రత్యామ్నాయంగా కొంతమంది రైతులు సేంద్రియ ఎరువుల తయారీపై, వాడకంపై ఆసక్తి చూపుతున్నారు. వాటి గురించి సమగ్రంగా తెలుసుకున్నాం. మన ఇళ్ల వద్ద కూడా మొక్కలు, ఆకుకూరలు, కాయగూరలు పెంచుకోవడానికి ఈ విధానం దోహదపడుతుంది.

- జి.లక్ష్మీహారిక

గ్రీన్‌హౌస్, పాలిహౌస్‌లపై అవగాహన



వివిధ రకాల మొక్కలను ఏవిధంగా సంరక్షించాలి, ఎంత మోతాదులో వాటికి నీరు పోయాలి, చీడ పురుగుల నుంచి ఏవిధంగా కాపాడుకోవాలనే అంశాలపై నేర్చుకున్నాం. మొక్కలు దెబ్బతినకుండా గ్రీన్‌హౌస్, పాలిహౌస్ నిర్మాణాల గురించి నర్సరీ రైతుల నుంచి తెలుసుకున్నాం. గ్రాఫ్టింగ్ లేయరింగ్ పద్ధతులు, తక్కువ విస్తీర్ణంలో కాయకూరల సాగు తదితర అంశాలు నేర్చుకున్నాం. నర్సరీల్లో పాఠ్యాంశాలు నేర్చుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది.

- ఎం.దేవి

క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలే లక్ష్యం

గాంధీనగర్: జేఎన్‌టీయూకే తరపున 2024-25 విద్యా సంవత్సరంలో ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్లలో పాల్గొనే క్రీడాకారులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం వీసీ కాన్ఫరెన్స్ మందిరంలో యూనివర్సిటీ 10వ స్పోర్ట్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా స్పోర్ట్స్ కౌన్సిల్ ఛైర్మన్, ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ హాజరయ్యారు. అతిథులుగా వైస్ ఛైర్మన్, రెక్టార్ కేవీ రమణ, ట్రెజరర్, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్, సభ్యులు పాల్గొన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించిన నివేదిక, చేపట్టిన కార్యక్రమాలను కార్యదర్శి శ్యామ్‌కుమార్ వివరించారు. ప్రతిపాదిత అజెండాలోని అంశాలపై 2024-25 విద్యా సంవత్సరానికి సమర్పించిన బడ్జెట్ ప్రతిపాదనలపై చర్చించారు. డీపీఏ జి.యేసురత్నం, డీపీపీ బి.బాలకృష్ణ, డీఈ జి.పద్మజారాణి, రత్నకుమారి, హరిత తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజధానికి కమిషనర్ భావన

కాకినాడ కలెక్టరేట్: కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావన శనివారం రాష్ట్ర రాజధానికి వెళ్లనున్నారు. అక్కడ ఉదయం 10 గంటలకు పురపాలకశాఖ కమిషనర్ నిర్వహించే రాష్ట్రస్థాయి సమీక్షకు హాజరుకానున్నారు. తిరిగి రాత్రికి కాకినాడ చేరుకుని, 21, 22 తేదీల్లో దిల్లీలో జరిగే నక్షా కార్యశాలకు బయలుదేరి వెళతారు. 23న తిరిగి వస్తారు.

మందుబాబులకు జరిమానా

మసీదు సెంటర్: ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఆదేశాల మేరకు నగర ట్రాఫిక్-1,2 విభాగ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. 7 మందిపై కేసులు నమోదు చేశామని సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు తెలిపారు. కోర్టులో హాజరుపరచగా నలుగురికి రెండు రోజుల జైలు, ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు చెప్పారు. కాకినాడ మూడో అదనపు సెకెండ్ క్లాస్ జేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి వి.నరసింహారావు శుక్రవారం ఈ మేరకు తీర్పు చెప్పారన్నారు.

ఉచిత బస్‌పాస్‌ల పంపిణీ

సాంబమూర్తినగర్: కాకినాడ శ్రీనగర్ ఎంపీఎల్ హైస్కూల్ విద్యార్థులకు శుక్రవారం ఉచిత బస్‌పాస్‌లను అందజేసినట్లు డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎంయూవీ మనోహర్ తెలిపారు. 10వ తరగతి లోపు చదువుతున్న బాలికలకు, ఏడో తరగతి లోపు బాలురకు ఈ పాస్‌లను అందజేశామన్నారు. వీటి ప్రాసెసింగ్ ఫీజు ఖర్చు రూ.50 రుసుంను కాకినాడ సీపోర్టు యాజమాన్యం అందజేసినట్లు ఏసీ తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కేఎన్‌వీ ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

21న ఉద్యోగ మేళా

కాకినాడ కలెక్టరేట్: కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో ఈనెల 21న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు వికాస పీడీ కె.లచ్చారావు శుక్రవారం తెలిపారు. హాల్‌మార్క్ గ్లోబల్ టెక్నాలజీస్‌లో జూనియన్ అకౌంటెంట్ ఉద్యోగాలకు ముఖాముఖి నిర్వహించనున్నట్లు చెప్పారు. బీకాం, ఎంకాం, ఎంబీఏ ఉత్తీర్ణులై, రెండేళ్ల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. విజయవర్మ అండ్ కో కంపెనీలో ఆఫీస్ అకౌంట్స్, కంప్యూటర్ ఆపరేటర్, ఫ్రంట్ ఆఫీస్ ఇన్‌ఛార్జి, సూపర్‌వైజర్, బజాజ్ క్యాపిటల్‌లో ఫైనాన్షియల్ అడ్వయిజర్, సర్వే డిపార్ట్‌మెంట్, టెలీకాలర్, ఫార్మా కంపెనీలో టెక్నీషియన్, కెమిస్టు, ఐసాన్ ఎక్స్‌పీరియన్‌సెస్‌లో టెలీ సేల్ రిప్రజెంటేటివ్, ఇసుజు మోటార్స్, పానాసోనిక్, డీఎస్‌సీ, ఇండో ఎంఐఎం కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ముఖాముఖిలు జరుగుతాయన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, బీటెక్ ఉత్తీర్ణులైన 35 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు సోమవారం ఉదయం 9 గంటలకు విద్యార్హత పత్రాలతో హాజరుకావాలని కోరారు.

'వన్ టైం పరీక్ష' రద్దుకు డిమాండ్



ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మసీదుసెంటర్(కాకినాడ): కాకినాడ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఫీల్డ్ సిబ్బందికి నిర్వహిస్తున్న వన్‌టైం పరీక్షను ఉపసంహరించాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏపీ వైద్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వి.వీరభద్రరావు పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. డా.ఎన్టీఆర్ వైద్య సేవ పథకాన్ని ఇన్సూరెన్స్ విధానంలోకి మార్చిన క్రమంలో పథకంలోని క్షేత్ర సిబ్బందికి క్యాడర్ కల్పించాలన్నారు. జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ రాధాకృష్ణను వారి సమస్యలు వివరించి, వినతిపత్రం అందజేశామన్నారు. పదోన్నతులు కల్పించాలన్నారు. చనిపోయిన సిబ్బందికి రూ.15 లక్షల పరిహారం, పదవీ విరమణ సదుపాయాలు ఇవ్వాలన్నారు. పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామన్నారు. యామిని కృష్ణ, కిషోర్‌బాబు, కె.బుజ్జి, కె.అనిల్‌కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

సాంబమూర్తినగర్: 2024-25 విద్యా సంవత్సరానికి స్కూల్ ఫెడరేషన్ గేమ్స్‌కు అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన ఏడుగురు రాష్ట్ర, జాతీయస్థాయిలో ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్.ఎన్.మూర్తిరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రగ్బీ అండర్-19 విభాగంలో నురుకుర్తి కళ్యాణి జాతీయ స్థాయికి, అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయికి పలివెల సునంద తేజస్వి, ఎర్రా జ్యోతి చంద్రిక, హ్యాండ్‌బాల్, వాలీబాల్‌లో అరిగెల త్రిపుర సుందరి, హ్యాండ్‌బాల్‌లో వాసంశెట్టి మాధవి, దుర్యోధనుల వీఎస్ మల్లేశ్వరి, పిల్లి యుగశ్రీలు ఎంపికైనట్లు తెలిపారు.

రోటరీ ఆధ్వర్యంలో విస్తృత సేవలు



మొక్కలు పంపిణీ చేస్తున్న గవర్నర్ తదితరులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో విస్తృతమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రోటరీ డిస్ట్రిక్ట్ అధికారిక పర్యటనలో భాగంగా రోటరీ గోల్డెన్ జూబ్లీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శాశ్వత సేవా ప్రాజెక్టులను శుక్రవారం ఆయన సందర్శించారు. అచ్చంపేటలో నిర్వహిస్తున్న రోటరీ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. ఆపై రోటరీ వృద్ధాశ్రమానికి వెళ్లి, వృద్ధుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. సోలార్ సిస్టం ఏర్పాటుకు సహకరించాలని కృష్ణప్రకాష్ కోరారు. అక్కడ మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ రోటరీ డిస్ట్రిక్ట్ ఆధ్వర్యంలో జీజీహెచ్‌లో త్వరలో తల్లిపాల కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తమ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను వివరించారు. అనంతరం భానుగుడి సెంటర్‌లో నగరవాసులకు మొక్కలు పంపిణీ చేశారు. రోటరీ పాస్ట్ గవర్నర్ డాక్టర్ ఎస్‌వీఎస్.రావు, అసిస్టెంట్ గవర్నర్ ధనసాగర్ ప్రసాద్, గోల్డెన్ జూబ్లీ అధ్యక్షుడు ఎస్.శ్రీకాంత్, కార్యదర్శి డి.శ్రీకాంత్, కోశాధికారి స్వరూపరాజ్, డాక్టర్ టివి.బాలకృష్ణ, నెక్కంటి శ్రీనివాసు, సుబ్రహ్మణ్యేశ్వరరావు, సూర్యారావు, కె.నాని పాల్గొన్నారు.

దుకాణం తొలగింపుపై ఆందోళన

కాకినాడ కలెక్టరేట్: జీపీటీ రోడ్డులో వెంటూరి రామారావుకు చెందిన సెలూన్ దుకాణాన్ని ముందస్తు నోటీసు ఇవ్వకుండా టౌన్ ప్లానింగ్ సిబ్బంది ధ్వంసం చేశారని, దీనిపై చర్యలు చేపట్టాలని ధన్వంతరి నాయీబ్రహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ దుకాణం తరలించడానికి సమయం కోరినా, ఉద్దేశ పూర్వకంగా చేశారని ఆరోపించారు. కనీసం వస్తువులను తీసుకోడానికి సమయం ఇవ్వలేదని, యజమాని జీవనోపాధిని కోల్పోయారన్నారు. మరోచోట స్థలాన్ని కేటాయించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ భావనకు వినతి పత్రం అందజేశారు. వేపాడ శ్రీనివాసరావు, వాడపల్లి ముసలయ్య, పొన్నాడ సత్యనారాయణ, వి.తాతాజీ, కొమ్మన తాతారావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సమాఖ్య ప్రతినిధులు

సాంకేతిక అంశాలు.. వృత్తిపరమైన అవగాహన



మాట్లాడుతున్న జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ మురళీకృష్ణ

గాంధీనగర్, న్యూస్‌టుడే: కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్, ఐవోట, డేటాసైన్స్, రోబోటిక్స్ తదితర కోర్సులపై పరిశ్రమలకు అనుగుణంగా అధ్యాపకులు సాంకేతిక అంశాలపై వృత్తిపరమైన అవగాహన కలిగి ఉండాలని జేఎన్‌టీయూకే ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ పేర్కొన్నారు. యూసీఈకే కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ ఏఐఅండ్‌ఎంఎల్ ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.9 అంశంపై రెండు రోజుల కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా ఇన్‌ఛార్జి వీసీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు సాంకేతికపరంగా ఆదరణలో ఉన్న కోర్సుల్లో చేరుతున్నారని, వారిని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలన్నారు. అతిథులుగా హాజరైన రెక్టార్ కేవీ రమణ, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ వి.రవీంద్రనాథ్‌లు మాట్లాడుతూ విద్యాసంస్థ, పరిశ్రమల అనుసంధానం ద్వారా విద్యార్థులకు బోధన, అభ్యాసన పద్ధతులను ప్రయోగాత్మకంగా వివరించేందుకు వీలు కలుగుతుందన్నారు. విశాఖపట్నం ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ మెకట్రానిక్స్ విభాగాధిపతి కె.మురళీకృష్ణ, హైటెక్ ఎంబెడెడ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి.వల్లభరావులు రిసోర్స్ పర్సన్లుగా పాల్గొన్నారు. పరిశ్రమల్లో అనుసరించే సాంకేతిక పద్ధతులు, డ్రోన్ సాంకేతికత, పరిశ్రమల సుస్థిరాభివృద్ధికి విద్యాసంస్థ, పరిశ్రమల అనుసంధానంపై అవగాహన కల్పించారు. యూసీఈకే ప్రిన్సిపాల్ మోహనరావు, ఓఎస్‌డీ కోటేశ్వరరావు, సీఎస్‌ఈ ఇన్‌ఛార్జి విభాగాధిపతి ఎ.కరుణ, ఎఎస్ఎన్.చక్రవర్తి, ఎల్.సుమలత, డైరెక్టర్లు విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల నిర్వహణ నిధులకు వినతి

కాకినాడ నగరం, సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: పాఠశాలలకు నిర్వహణ నిధులు విడుదల చేయాలని జిల్లా ప్రధానోపాధ్యాయుల సంఘం కోరింది. హెచ్‌ఎంల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెవ్వూరి రవి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సీవీవీ సత్యనారాయణ తదితరులు శుక్రవారం అమరావతిలో పాఠశాల విద్యా కమిషనర్ విజయరామరాజును కలిశారు. మూడేళ్లుగా పాఠశాలలకు గ్రాంట్లు మంజూరు చేయలేదని, వెంటనే విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.117ను రద్దు చేయాలన్నారు. 3, 4, 5 తరగతులను ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం, ఉపాధ్యాయులపై అదనపు పని భారం, విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందని ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం, వ్యాయమోపాధ్యాయుని పోస్టులు రద్దు చేయడం వంటివి ఉపసంహరించుకోవాలని కోరారు. ఎంఈవోల జాబ్ చార్ట్ సవరించాలని, సమాన అధికారాలు ఇవ్వాలన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు రవి వివరించారు.

స్కేటింగ్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

మసీదు సెంటర్: కాకినాడలో ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. 500 మీటర్ల విభాగంలో అండర్-11, 14, 17, 19 విభాగాల్లో విజేతల వివరాలను రాత్రి వెల్లడించారు. ★ అండర్-11: బాలికల విభాగంలో తన్మయినాగదుర్గ(గుంటూరు) బంగారు, ఎం.అనికాసుసాన్(తూర్పుగోదావరి)కి రజత, ఆకుల కావ్యశ్రీ(తూర్పుగోదావరి) కాంస్య పతకాలు సాధించారు. అలాగే బాలురు విభాగంలో వి.రుషీశ్వర్(తూర్పుగోదావరి) బంగారు, కె.జైచందన్(విశాఖ) రజత, కె.వర్షిత్(తూర్పుగోదావరి) కాంస్య పతకాలు సాధించారు. ★ అండర్-14 బాలికల విభాగంలో ఎ.ఎ.రమ్య(నెల్లూరు), వి.తనూజ(కృష్ణా), హర్షిక(తూర్పుగోదావరి) వరుసగా మొదటి మూడుస్థానంలో నిలవగా, బాలురు విభాగంలో ఎన్.నిఖిల్ ఈశ్వర్(తూర్పుగోదావరి), కె.విగ్నేష్(కృష్ణా), కె.గగన్ శివ శ్రీ సాయిరాం(తూర్పుగోదావరి) మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. ★ అండర్-17 బాలికల విభాగంలో వి.వీర వర్షిణి(తూర్పుగోదావరి), విద్య ప్రజాపతి(విశాఖ), ఎస్.జస్మిత(నెల్లూరు) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. బాలుర విభాగంలో పి.జాన్సన్(విశాఖ), ఎ.లోహిత్ సాయి(విశాఖ), కె.లిఖిత్(తూర్పుగోదావరి) మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. అండర్-19 బాలికల విభాగంలో కె.స్నేహ కృతి(చిత్తూరు), వి.జాహ్నవి ప్రభ(కృష్ణా), సీహెచ్ మౌనిక దివ్యశ్రీ(పశ్చిమగోదావరి) మూడు స్థానాల్లో నిలవగా, బాలురు విభాగంలో కె.శ్రీవిందన్(చిత్తూరు), ఆర్.జస్వంత్(కృష్ణా), కుసుమ అర్జున్(తూర్పుగోదావరి) వరుస స్థానాల్లో నిలిచారు.

ముక్కుమూసుకు వెళ్లాల్సిందే..



మూసుకుపోయిన కాలువ

కాకినాడను ఆకర్షణీయ నగరంగా తీర్చిదిద్దుతున్నామని అధికారులు చెబుతున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి మాత్రం అందుకు భిన్నంగా ఉంది. కచేరిపేటలోని మురుగు కాలువ మట్టితో పూడిపోవడంతో మురుగు ముందుకు పారే పరిస్థితి లేదు. దీనికి తోడు వర్షాలతో నీరు నిలిచి, మురుగంతా రోడ్డు మీదకు చేరుతోంది. వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర దుర్వాసన వస్తుందని, దోమల బెడద విపరీతంగా పెరిగిందని స్థానికులు వాపోతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, గాంధీనగర్



రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

చినుకు పడితే రంగ.. రంగా

కాకినాడ నగరంలో ఎంతో చరిత్ర కలిగిన రంగరాయ వైద్య కళాశాల క్రీడా ప్రాంగణం చెరువైంది. గత కొద్ది రోజులుగా పడుతున్న వర్షాలకు మైదానంలో నీరు నిలిచిపోయింది. గతంలో నీరు బయటకు పోయేందుకు ప్రత్యేకంగా మార్గాలు ఉండేవి. ప్రస్తుతం అవన్నీ పూడికపోవటంతో ఈ పరిస్థితి నెలకొంది. విద్యార్థులు ఆడుకునేందుకు కుదరట్లేదు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. – ఈనాడు, కాకినాడ



మైదానంలో నిలిచిపోయిన వర్షపు నీరు



భవనాల్లోకి వెళ్లేదెలా..



సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న సీఐ పెద్దిరాజు

సైబర్ నేరాలు.. చోరీలపై అప్రమత్తం

సాంబమూర్తినగర్: సైబర్ నేరాలు, దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పవరం సీఐ పెద్దిరాజు సూచించారు. కాకినాడ సురేష్‌నగర్ ఉద్యానంలో శుక్రవారం సందర్శకులతో అవగాహన సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని, వాటి బారినపడకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్లు, సందేశాలు వస్తే వెంటనే స్పందించకూడదన్నారు. రోడ్లపై రాకపోకలు సాగించేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. తప్పనిసరిగా లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. పిల్లలకు ఎక్కువ సీసీ సామర్థ్యం ఉన్న వాహనాలు ఇస్తున్నారని, అది చాలా ప్రమాదకరమన్నారు. ఎస్సైలు ఏసుబాబు, శ్రీనివాసు, బ్లూకోర్ట్ సిబ్బంది, సురేష్‌నగర్ శాస్త్రినగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


రహదారులు జలమయం



టుటౌన్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు

నగరంలో శుక్రవారం ఉదయం కురిసిన భారీ వర్షానికి పలు రహదారులు జలమయం అయ్యాయి. నగరంలోని టుటౌన్, శ్రీనగర్, భాస్కర్‌నగర్, సినిమా రోడ్డు, చిన్నమార్కెట్, కొత్త కాకినాడ, శాంతినగర్, శశికాంత్‌నగర్, గాంధీబొమ్మ సెంటర్ తదితర లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. కాలువల్లోని మురుగు రోడ్డుపైకి రావడంతో తీవ్ర దుర్వాసన వ్యాపించింది. పలు ప్రధాన రహదారులపై గుంతలు ఏర్పడడంతో ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షాల కారణంగా మరింత దుర్భరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–న్యూస్‌టుడే, మసీదుసెంటర్, సాంబమూర్తినగర్



చినమార్కెట్ వద్ద రహదారిలో రాకపోకలు

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

ప్రేమ విఫలమే కారణమా..!

మసీదుసెంటర్, న్యూస్‌టుడే: ఉరివేసుకుని ఓ యువకుడు మృతిచెందిన సంఘటన కాకినాడలో చోటుచేసుకుంది. అనుమానాస్పద మృతిగా కాకినాడ పోర్టు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై జాన్ బాషా తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ హార్బర్‌పేటకు చెందిన ఆర్.శివనాగు రాఘవ(20) వేటకు వెళ్తుంటాడు. గురువారం రాత్రి ఇంటి వద్ద ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. ప్రేమ విఫలం కావడంతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబసభ్యులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

కాకినాడ గ్రామీణం
• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల అండ

పిఠాపురం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు అండగా నిలవాలని ఎంఈవో శ్యాంబాబు కోరారు. శుక్రవారం పిఠాపురం ఏకేపీఎం పాఠశాలలో పూర్వ విద్యార్థి ర్యాలీ రవి రూ.3 లక్షలతో నిర్మించిన డైనింగ్, స్టడీ హాల్‌ను ఎంఈవో ప్రారంభించారు. సదుపాయాలు సమకూర్చిన రవిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు.


డైనింగ్ హాల్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో శ్యాంబాబు

లయన్స్‌క్లబ్ వనమహోత్సవం

సర్పవరం జంక్షన్: కాకినాడ అర్బన్ రమణయ్యపేట బోటు క్లబ్ ఉద్యానంలో లయన్స్ క్లబ్ కాకినాడ ఎలైట్ అధ్యక్షుడు ఎంఎస్ఆర్‌వీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులు శుక్రవారం వనమహోత్సవం నిర్వహించారు. ఉద్యాన ఆవరణలో మొక్కలు నాటారు. ప్రతినిధులు ఆదిత్య, సత్యనారాయణ, ప్రసాదరావు, సత్తిరెడ్డి, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న క్లబ్ ప్రతినిధులు

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

సర్పవరం జంక్షన్: కాకినాడ గ్రామీణ నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం రహదారులు, మురుగు కాలువలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రాధాన్యమిచ్చి అభివృద్ధి పథంలో నియోజకవర్గాన్ని తీర్చిదిద్దడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని ఎమ్మెల్యే పంతం నానాజీ తెలిపారు. శుక్రవారం గంగనాపల్లి, వీడీ, ఇంద్రపాలెం గ్రామాల్లో ఎమ్మెల్యే అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. గోవిందరాజు, శివప్రసాద్, శ్రీనివాస్, శ్రీనివాసబాబా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ఇంద్రపాలెంలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నానాజీ

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం

పిఠాపురం: పంచాయతీల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పల్లె పండగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా కుమారపురం, ఎఫ్‌కే పాలెం, కందరాడ, జల్లూరు, మల్లాం, మంగితుర్తి, కోలంక గ్రామాల్లో రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిని గాలికొదిలేసిందన్నారు. శంకుస్థాపన చేసిన పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భాజపా నియోజకవర్గ అధ్యక్షుడు బుర్రా కృష్ణంరాజు, జనసేన నాయకులు పిల్లా శ్రీధర్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మర్రెడ్డి శ్రీనివాస్ తదితరులు

మేమున్నాం.. మీకు తోడుగా

సమస్య: పెదపూడి మండలం కైకవోలు నుంచి శహపురం గ్రామాల మధ్య రోడ్డు మధ్యలో కుంగి ప్రమాదకరంగా ఉంది. ప్రయాణికులు కుంగిన ప్రాంతంలో పడి పక్కనే ఉన్న కాలువలో పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. - స్థానికులు, శహపురం

సమాధానం: ఆ ప్రాంతాన్ని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - లోవరాజు, ర.భ.శాఖ ఏఈ, పెదపూడి

సమస్య: ఆర్‌బీ కొత్తూరు గ్రామంలోని రామాలయం వద్ద విద్యుత్తు తీగలు కిందకు ప్రమాదకరంగా ఉన్నాయి. వాటిని సవరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. - సాజే హనుమంతరావు

సమాధానం: గ్రామానికి సిబ్బందిని పంపి విద్యుత్తు తీగలు సవరించడానికి తగిన చర్యలు తీసుకుంటా. - పి.సుబ్బారావు, ఏఈ

- న్యూస్‌టుడే పెదపూడి, పెద్దాపురం

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:
కాకినాడ గ్రామీణం: 80085 74325
పెద్దాపురం: 80085 74198
పిఠాపురం: 80085 65544

క్రీడలకు ప్రోత్సాహం.. విద్యార్థుల్లో ఉత్సాహం

క్రీడల ప్రోత్సాహానికి ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవ తీసుకున్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులను క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు సీఎస్ఆర్ నిధులతో క్రీడా సామగ్రి అందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకోసం తొలివిడతలో ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలకు రూ.50 వేల విలువైన క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. వ్యాయామోపాధ్యాయులు కూడా విద్యార్థులకు ఆటలపై ఆసక్తి పెంచేలా చూడాలని ఆదేశించారు. - న్యూస్‌టుడే, పిఠాపురం


వాలీబాల్ నాణ్యతను పరిశీలిస్తున్న పవన్ కల్యాణ్

పిఠాపురం ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. పాఠశాల స్థాయి నుంచే జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతో చర్యలు ప్రారంభించారు. గడిచిన అయిదేళ్లుగా విద్యార్థులు ఆటలకు దూరమయ్యారు. మైదానాలు లేక కేవలం చదువుకే పరిమితమయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులైతే ఆటలంటే మరిచిపోయే స్థితికి చేరారు. దాంతో విద్యార్థుల్లో ఉత్సాహం నింపేందుకు, ఆటల్లో రాణించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక అమలు చేస్తోంది. అందులో భాగంగా పవన్‌కల్యాణ్ నియోజకవర్గం నుంచే క్రీడలపై ఆసక్తి పెంచేందుకు చర్యలు చేపట్టారు. పవన్‌కల్యాణ్ ఆశయ సాధనకు జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ మరింత చొరవ తీసుకుంటున్నారు.

జిల్లాలో సీఎస్ఆర్ నిధులు కేటాయించి, క్రీడలకు ప్రత్యేక కిట్ల పంపిణీ చేపట్టారు. పిఠాపురం, కొత్తపల్లి, గొల్లప్రోలు మండలాల్లోని 32 జిల్లా పరిషత్తు, మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో పాఠశాలకు రూ.50 వేల విలువైన రెండేసి క్రీడా సామగ్రి కిట్లు సిద్ధం చేశారు. ఇలా రూ.16 లక్షలు ఈ నియోజకవర్గానికే కేటాయించారు. మంగళగిరిలోని జనసేన కార్యాలయంలో పవన్‌కల్యాణ్ కిట్ల నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుంచి తీసుకొచ్చిన కిట్లను కలెక్టర్ షాన్ మోహన్ స్థానిక ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ పాఠశాలలో గత మంగళవారం అట్టహాసంగా పంపిణీ చేశారు. త్వరలోనే అన్ని పాఠశాలలకు కిట్లు అందించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ఇందులో వాలీబాల్, క్రికెట్ బ్యాట్, క్యారంబోర్డు, టెన్నిస్, టేబుల్ టెన్నిస్ వంటి 21 రకాల క్రీడా కిట్లు అందిస్తున్నారు.

మైదానాలు మెరుగుపరిస్తే..

పిఠాపురం పట్టణంలో అయిదు మున్సిపల్, ప్రభుత్వ పాఠశాలలు, గొల్లప్రోలు నగర పంచాయతీలో రెండు జడ్పీ పాఠశాలలు ఉన్నాయి. ఇవికాకుండా మూడు మండలాల పరిధిలోనూ 30 జిల్లా పరిషత్ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలల్లో అయిదు ఎకరాల క్రీడా మైదానం ఉండాలనే నిబంధనలు ఉన్నప్పటికీ 20 పాఠశాలల్లో మాత్రమే కాస్త అనువైన మైదానాలున్నాయి. వాటికి కూడా ప్రహరీ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డగా మారుతున్నాయి. ముఖ్యంగా ఓబీఎస్, ఆర్ఆర్‌బీహెచ్ఆర్, మున్సిపల్ బాలికోన్నత, ఏకేపీఎం పాఠశాలల్లో ఇటీవల అదనపు తరగతి గదుల నిర్మాణం వల్ల మైదానాల విస్తీర్ణం తగ్గిపోయింది. జిల్లా పరిషత్ పాఠశాలల్లో అయిదేళ్లుగా అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడం వల్ల మైదానాలు ఇరుకుగా మారాయి. పలుచోట్ల జడ్పీ పాఠశాలల్లో మైదానాలే లేని పరిస్థితి నెలకొంది. పలుచోట్ల స్థలాలు కబ్జాకు గురవుతున్నాయి. క్రీడా మైదానాలు ఎత్తు చేసి, కోర్టులుగా విభజిస్తే ఆటలకు అనువుగా ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు.


క్రీడా సామగ్రి అందిస్తున్న కలెక్టర్ షాన్ మోహన్

స్ఫూర్తిని పెంపొందించేందుకే..

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తి పెంపొందించాలనే ఉద్దేశంతో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ క్రీడా సామగ్రి కిట్లు సమకూర్చారు. 21 రకాల సామగ్రిని 32 పాఠశాలలకు అందించాం. మిగిలినవాటికీ అందిస్తాం. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని, క్రీడల్లో రాణించాలి. క్రీడా కోటాలో కొలువులు సాధించాలి.

- జి.శ్యాంబాబు, మండల విద్యాశాఖ అధికారి, పిఠాపురం

జిమ్నాస్టిక్స్‌లో ద్వితీయ స్థానం

పెద్దాపురం: గుంటూరు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో అక్కడి బీఆర్ స్టేడియంలో ఈ నెల 17, 18 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జిమ్నాస్టిక్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో అండర్-10 విభాగంలో పెద్దాపురం మండలం ఆర్‌బీ పట్నం గ్రామానికి చెందిన చిన్నారి మన్యం పల్లవి ద్వితీయ స్థానం సాధించింది. ఈమెకు కోచ్ సురేష్ శిక్షణ అందిస్తున్నారు. పలువురు అభినందించారు.


మన్యం పల్లవి

జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో ప్రథమం


ప్రతిభచాటిన విద్యార్థినులు

సామర్లకోట: కాకినాడ ఏపీఎస్పీ జడ్పీ పాఠశాలలో ఏఎంవో రామారెడ్డి ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు గాయత్రి అధ్యక్షతన జిల్లాస్థాయిలో పీఎంశ్రీ పాఠశాలలకు వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. 'వన్ ఇండియా-వన్ నేషన్' అంశంపై నిర్వహించిన పోటీలో సామర్లకోట బచ్చు ఫౌండేషన్ పురపాలక సంఘ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు వీవీడీ చాందిని, హరిణిసాయిలక్ష్మి ప్రథమ స్థానం సాధించారని హెచ్ఎం తెలిపారు. వారిని ఎంఈవో శివరామకృష్ణయ్య, పుల్లయ్య, కమిషనర్ శ్రీవిద్య, చక్రధర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన గిరీష్‌వర్మ

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తనయుడు, తెదేపా యువనేత గిరీష్‌వర్మ మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందించానని తెలిపారు.



వేర్వేరు కేసుల్లో ముగ్గురి అరెస్టు

పిఠాపురం, కొత్తపల్లి: జగ్గయ్యచెరువు ప్రాంతంలో ఒకరిపై హత్యాయత్నం చేసిన వ్యక్తిని అరెస్టు చేసినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై మణికుమార్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 16న సత్తెమ్మతల్లి ఆలయం వద్ద అన్నదమ్ములైన మేడిశెట్టి రామకృష్ణ, బాబ్జీ మధ్య ఘర్షణ జరుగుతుండగా పసుపులేటి శ్రీనివాసరావు అనే వ్యక్తి అడ్డుకోబోయారు. రామకృష్ణ కత్తితో దాడి చేసి, తన బండిని కాల్చేశాడని శ్రీనివాసరావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. శుక్రవారం రామకృష్ణను అరెస్టు చేశారు. ● మూలపేటలో ఈ నెల 17న తాతీలు అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఆవాల మణికంఠ, లోవరాజులను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వీరికి పిఠాపురం కోర్టులో రిమాండ్ విధించారని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎస్సై వెంకటేష్, సిబ్బందిని అభినందించారు.

ఫ్లెక్సీలు.. బెంచీల తొలగింపుపై వివాదం

గొల్లప్రోలు: ఎ.కె.మల్లవరంలోని బీసీపేటలో ఫ్లెక్సీలు, సిమెంటు బెంచీల తొలగింపుతో ఇరువర్గాల మధ్య వివాదం నెలకొంది. రెవెన్యూ, పోలీసు అధికారులు రెండు వర్గాలకు చెందినవారితో చర్చించారు. గురువారం రాత్రి నుంచే పోలీసు పికెట్ ఏర్పాటు చేసిన అధికారులు శుక్రవారం మధ్యాహ్నం రెండు వర్గాలకు చెందిన పది మందితో శాంతి కమిటీ ఏర్పాటు చేసి సాయంత్రం గొల్లప్రోలు తహసీల్దారు కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. తహసీల్దారు సత్యనారాయణ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

రమణయ్యపేట(సర్పవరం జంక్షన్): రమణయ్యపేట ఏపీఐఐసీకాలనీలో శుక్రవారం నారాయణసేవ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 200 మంది వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎనిమిదేళ్లుగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతోపాటు అవసరమైన వృద్ధులకు పాదరక్షలు, గొడుగులు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

చెరువు ఇలా.. ఆదాయం వచ్చేదెలా

తాళ్లరేవు, న్యూస్‌టుడే: తాళ్లరేవు మండలం సుంకరపాలెం పంచాయతీ చేపల చెరువులు మూడేళ్ల నుంచి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ చెరువు పిచ్చి మొక్కలతో పాటు చెత్తాచెదారాలతో పూర్తిగా నిండిపోయింది. గతంలో మత్స్యకార సొసైటీలకు చెరువులను లీజుకు ఇవ్వడంతో పంచాయతీకి ఆదాయ వనరుగా ఉపయోగపడేది. ఎకరం విస్తీర్ణంలో ఉన్న రెండు చెరువులను శుభ్రం చేయకుండా వదిలేశారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి జ్యోతి సుధాను వివరణ కోరగా చెరువులో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించి శుభ్రం చేస్తామని తెలిపారు.


సుంకరపాలెంలోని పంచాయతీ చేపల చెరువు దుస్థితి

వర్షం.. దారి దయనీయం

పిఠాపురం పట్టణంలో పలు రోడ్లు చిన్నపాటి వర్షానికే ముంపునకు గురవుతున్నాయి. రోడ్లు గుంతలుగా మారడం, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పట్టణంలోని గుట్ల వీధిలోని రోడ్డుపై వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వస్తాద్ వీధి, రథాలపేట సెంటర్‌లోని రోడ్లపైనా ఇదే పరిస్థితి. మరోపక్క ఆర్ఆర్‌బీహెచ్ఆర్ క్రీడా మైదానం చెంతన డ్రెయినేజీ లేక వర్షం నీరు ప్రధాన ర.భ.శాఖ రహదారిపై నిలిచిపోయి చెరువులా మారుతోంది. దాంతో ఆటోలు, బస్సులు నీటిలోంచి వెళ్లేందుకు అవస్థలు తప్పడం లేదు. రోడ్ల మెరుగుకు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. కమిషనర్ కనకారావును అడగగా మరమ్మతులు చేపడతామన్నారు.



- న్యూస్‌టుడే, పిఠాపురం

ఈ మార్గం.. అపాయకరం

సామర్లకోట-వేట్లపాలెం కెనాల్ రోడ్డులోని గుంతల్లో లోడు ట్రాక్టరు బోల్తాపడింది. శుక్రవారం కాకినాడ రోడ్డు నుంచి వేట్లపాలెం వైపునకు తవుడు లోడుతో ట్రాక్టర్ వెళుతుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రైల్వే వంతెన కింది నుంచి మాండవ్య నారాయణస్వామి ఆలయం వంతెన మీదుగా నవభారత్ పరిశ్రమ వరకు వెళ్లే కెనాల్ అప్రోచ్ రోడ్డుపై పెద్దపెద్ద గుంతలుపడ్డాయి. ఆ గుంతల్లో వర్షపు నీరు చేరడంతో డ్రైవరు గమనించకుండా వెళ్లడంతో ట్రాక్టరు బోల్తాపడింది. ఘటనపై తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

- న్యూస్‌టుడే, సామర్లకోట



శోభాయమానం.. బొమ్మల కల్యాణం

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలో సంప్రదాయబద్ధంగా బొమ్మల పెళ్లి నిర్వహించారు. స్థానిక శిష్టకరణాల వీధిలోని పురుహూతిక అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా కొన్నేళ్లుగా బొమ్మల పెళ్లి జరిపించడం ఆచారంగా వస్తోంది. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి నార్లమహంతి సుబ్బలక్ష్మి, సూరిబాబు ఇంటి నుంచి పెళ్లి కుమార్తెను, పడాలవారి కుటుంబం నుంచి పెళ్లి కుమారుడిని కల్యాణ వేదిక వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం భారీ బాణసంచా కాల్పుల మధ్య, ఏలూరి సూర్యనారాయణ, నాగరత్నం చేతుల మీదుగా అర్చకుడు బొమ్మల కల్యాణంను కనుల పండువగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. నేటితరానికి ఆచారాలను పరిచయం చేసేందుకు జరిపించామని నిర్వాహకులు తెలిపారు. స్థానికులకు ప్రత్యేక విందు కూడా ఏర్పాటు చేశారు. ఆదివారం శ్రీపుష్పయాగం నిర్వహిస్తామన్నారు.



జీవిత బీమా ఏజెంట్ల ధర్నా

పెద్దాపురం: కొత్త పాలసీలకు సంబంధించి ఏజెంట్ల కమిషన్‌పై కార్పొరేషన్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ శుక్రవారం పెద్దాపురం జీవిత బీమా కార్యాలయం ఎదుట ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షుడు అపాన నాగేశ్వరరావు, కార్యదర్శి గొండేల జగదీశ్వరరావు, కోశాధికారి బి.ఎన్నార్‌శాస్త్రి, డివిజన్ ఈసీ సభ్యుడు కృష్ణంరాజు, ఉపాధ్యక్షుడు కొండపల్లి అర్జునరావు, సహాయ కార్యదర్శులు సామిరెడ్డి గోపి, వాసంశెట్టి గంగా, భానుమతి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

పెదపూడి, న్యూస్‌టుడే: పెదపూడి శ్రీ లక్ష్మీ జనార్దన స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సమర్పించిన వివిధ ద్రవ్యాలతో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం కల్పించారు. మహిళలు ఆలయ ప్రాంగణంలో లక్ష్మీపారాయణాలు చేశారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గోవింద్

పిఠాపురం: పిఠాపురం ఉప్పాడ బస్టాండు ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పలివెల గోవింద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం పొన్నాడలోని బషీబీబీ ఆలయం వద్ద సర్వసభ్య సమావేశం జరిగింది. ఉపాధ్యక్షుడిగా నాగేశ్వరరావు, కార్యదర్శిగా వర్ధనపు కృష్ణ, కోశాధికారిగా మంగ శ్రీను, సంయుక్త కార్యదర్శిగా అర్జున్, గౌరవాధ్యక్షుడిగా పైలా ఏసుబాబులతోపాటు పదిమంది కార్యవర్గ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

రక్షిత నీటి సరఫరా

ఈనాడు కథనాలకు స్పందన

గొల్లప్రోలు: గొల్లప్రోలులో తాగునీటి ఎద్దడి పరిష్కారానికి నగర పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. 'ఈనాడు'లో ఈ నెల 16న 'గొల్లప్రోలులో తాగునీటి ఎద్దడి' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దాంతో నగర పంచాయతీ అధికారులు స్పందించారు. తాటిపర్తిలో బోరు మోటార్లకు మరమ్మతులు చేపట్టి కుళాయిల ద్వారా రక్షితనీటి సరఫరాను పునరుద్ధరించారు. ప్రాంతాల వారీగా రక్షిత నీరు సరఫరా చేస్తున్నామని ఏఈ ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు.

వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: కోరింగ పంచాయతీ సీతారామపురం గుడ్డివాని తూము కూడలి మురుగు కాలువలో పేరుకుపోయిన చెత్తను సిబ్బంది తొలగించారు. శుక్రవారం 'వ్యర్థాలు తొలగించండి సారూ' శీర్షికతో ఈనాడులో వార్త ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి విజేవీ.రమణ, సర్పంచి పెయ్యల మంగేష్ స్పందించారు. పంచాయతీ కార్మికులు కాలువలో పేరుకుపోయిన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి కాలువను శుభ్రం చేశారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని సీపీఎం ధర్నా

పెద్దాపురం, సామర్లకోట: ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై రూ.20 కోట్ల భారం వేయడం అన్యాయమని, తక్షణం రద్దు చేయాలని కోరుతూ శుక్రవారం పెద్దాపురం విద్యుత్తు శాఖ కార్యాలయం ఎదుట సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం విద్యుత్తు ఛార్జీలు పెంచేసి ప్రజలపై పెనుభారం వేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యుత్తు ఛార్జీల పెంపుదల ఉండదని నాయకులు ఎన్నికలప్పుడు చెప్పారన్నారు. ఆ హామీ నిలబెట్టుకోవాలన్నారు. నాయకులు నాగు, శ్రీనివాస్, సత్తిబాబు, మరిడయ్య, సత్యనారాయణ, కృష్ణ, అప్పన్న, వీర్రాజు, పెంటయ్య, రమణ, నరసింహమూర్తి, విశ్వనాథం పాల్గొన్నారు. ● విద్యుత్తు వినియోగదారులపై ప్రభుత్వం ట్రూఅప్ ఛార్జీల భారం మోపే నిర్ణయాన్ని తక్షణం వెనక్కి తీసుకోవాలని సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. శుక్రవారం స్థానిక ఉపకేంద్రం నిరసన తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి కరణం ప్రసాదరావు మాట్లాడారు. స్మార్ట్ మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈఈ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. గోవిందరాజు, కొండలరావు, శ్రీనివాస్, హరిబాబు, సురేష్, వీరబాబు, పవన్, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


ఈఈ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం: పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో అర్చనలు నిర్వహించారు. వేదపండితులు వెంకటశాస్త్రి, ఇంద్రగంటి ప్రసాద శర్మ, సహాయ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పట్టు పురుగులు పెంచే రైతులకు రాయితీలు

గొల్లప్రోలు: పట్టు పురుగులు పెంచేందుకు అవసరమైన మందుల కొనుగోలుకు రాయితీ అందించనున్నట్లు చేబ్రోలులోని పట్టు పరిశ్రమశాఖ అధికారి మోసయ్య శుక్రవారం తెలిపారు. యూనిట్ విలువ రూ. 5 వేలు కాగా, ప్రభుత్వపరంగా రాయితీగా రూ.3,750 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామన్నారు. 55 మంది రైతులకు రాయితీ సొమ్ము మంజూరైందన్నారు. మల్బరీ తోటలు పెంచేందుకు అవసరమైన బ్రష్‌కట్టర్‌ను 50 శాతం రాయితీతో ఇస్తామన్నారు. స్ప్రేయర్లు సైతం అందిస్తారన్నారు.

రక్తహీనత నివారణపై అవగాహన

గొల్లప్రోలు: పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చునని వైద్యారోగ్యశాఖ పర్యవేక్షకులు తెలిపారు. తాటిపర్తిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

చికిత్సపొందుతూ ఇద్దరు మృతి

మసీదుసెంటర్(కాకినాడ): పిఠాపురం మండలానికి చెందిన ఇద్దరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతిచెందారు. పిఠాపురానికి చెందిన వి.దుర్గారావు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. తీవ్రగాయాలవ్వడంతో గతనెల 23న జీజీహెచ్‌లో చేర్చారు. పిఠాపురం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ● పిఠాపురం మండలం జల్లూరుకు చెందిన కె.దుర్గారావు(21) వ్యక్తిగత కారణాలతో గడ్డిమందు తాగారు. తీవ్ర అస్వస్థతకు గురవ్వడంతో గతనెల 24న జీజీహెచ్‌లో చేర్చారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. పిఠాపురం గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు.

చేబ్రోలులో బాణసంచా సామగ్రి స్వాధీనం

గొల్లప్రోలు: చేబ్రోలులో అక్రమంగా నిల్వఉంచిన బాణసంచా సామగ్రిని శుక్రవారం రాత్రి గొల్లప్రోలు పోలీసులు స్వాధీనపరుచుకున్నారు. గ్రామ శివారు పొలాల్లోని పట్టుపురుగులు పెంచే షెడ్డులో ఉంచినట్లు సమాచారం రావడంతో ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. కేసు నమోదు చేస్తామని ఎస్సై తెలిపారు.

స్నేహితుడి కుమార్తెకు ఆర్థిక సాయం

తాళ్లరేవు: తాళ్లరేవు వాస్తవ్యులు ప్రస్తుతం సామర్లకోట వాసి. డైమండ్ గ్రూపు (1987-88) సభ్యుడు మందారపు సుబ్రహ్మణ్యం 5సంవత్సరాల కిందట చనిపోయారు. ఆయన కుమార్తె కామాక్షికి రెండు రోజుల కిందట వివాహం జరిగింది. తండ్రి చనిపోయిన కారణంగా డైమండ్ గ్రూపు సభ్యుడు, తాళ్లరేవు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యారాజు, బాలయోగి చేతుల మీదుగా ఆమెకు రూ.15వేలు ఆర్థిక సాయాన్ని చెక్కు రూపంలో శుక్రవారం అందించారు. బిళ్లకుర్తి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

చీడిగలో తాగునీటి సమస్యలు

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: కాకినాడ గ్రామీణం చీడిగ గ్రామంలో ప్రజలు తాగునీటి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చీడిగలోని 10 కాలనీల్లో సుమారు 11 వేల మంది నివసిస్తున్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభాకు తగినట్లు తాగునీరు అందించడం అధికారులకు మరింత ఇబ్బందికరంగా మారుతోంది. గతంలో 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు ఉండగా.. గ్రామ అవసరాలు తీరడం లేదని మరో రెండు 60 వేల లీటర్ల ట్యాంకులు నిర్మించారు. వీటిలో ఒకదానికి నీరు సరఫరా కావడం లేదు. దాంతో ఆ ప్రాంతం వారు ప్రైవేటు ఆర్వో ప్లాంట్లు, కాకినాడ కుళాయి చెరువు నుంచి తాగునీరు తెచ్చుకుంటున్నారు. గ్రామంలో సుమారు 2 వేల ఇళ్లకు 160 వీధి కుళాయిలు, 800 ఇళ్లలోని కుళాయిలు ఉండగా నెలలో 20 రోజులు మాత్రమే నీటిని అందించగలుగుతున్నారు.

త్వరలోనే సమస్యలకు పరిష్కారం చూపుతాం

చీడిగ గ్రామంలో తాగునీటి సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. నిర్మాణం పూర్తయిన ఓవర్‌హెడ్ ట్యాంకుకు సంబంధించిన సాంకేతిక సమస్యలు పరిష్కరించి త్వరలో వినియోగంలోకి తీసుకువస్తాం. - టి.మారుతీరావు, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కాకినాడ గ్రామీణం


గ్రామంలో తాగునీరు పట్టుకుంటున్న మహిళ

తుని

•తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

సీఎంకు నియోజకవర్గ సమస్యలపై వినతి



సమావేశానికి హాజరైన ఎమ్మెల్యేలు దివ్య, సత్యప్రభ

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని ప్రజల అవసరాలు తీర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ కోరారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశానికి హాజరైన ఆమె ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలోని సాగునీటి వనరుల సమస్యలు, రహదారుల నిర్మాణం, గిరిజన ప్రాంతాల అభివృద్ధి తదితర అంశాలను వివరించారు.

గ్రామస్థాయి నుంచి భాజపా బలోపేతం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: భాజపాను గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నేత రావూరి సుధ అన్నారు. ప్రత్తిపాడులో సభ్యత్వ నమోదును శుక్రవారం పరిశీలించి మాట్లాడారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కొక్కిరగెడ్డ గంగాధర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు సింగిలిదేవి సత్తిరాజు తదితరులతో కలిసి ప్రత్తిపాడులో సభ్యత్వాలు నమోదు చేశారు. మండల భాజపా నాయకులు గున్నాబత్తుల రాజబాబు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విశిష్ట సేవలందించినవారికి సన్మానం

తుని పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ పోలీస్‌స్టేషన్‌లో అయిదేళ్లుగా విశిష్ట సేవలందించి బదిలీపై వెళుతున్న సిబ్బందిని సీఐ ఎం.గీతారామకృష్ణ శుక్రవారం అభినందించారు. జిల్లాలోని వివిధ స్టేషన్లకు బదిలీ అయిన వారిలో ఇద్దరు ఏఎస్సైలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 13 మంది కానిస్టేబుళ్లు ఉన్నారు. విధుల నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించాలని వారికి సూచించారు.

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి

తుని, న్యూస్‌టుడే: ప్రతిభకు మెరుగులు దిద్దుకుంటూ పలువురు విద్యార్థులు ఉత్సాహంగా వ్యాసరచన పోటీల్లో పాల్గొన్నారు. పట్టణంలోని సిద్ధార్థ స్కూల్లో 'ఈనాడు' ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై అభిప్రాయాలు స్వేచ్ఛగా వెల్లడించారు. ఇంటర్నెట్ వినియోగంతో మంచి, చెడు ప్రభావం సమాజంపై ఉన్నాయని, సోషల్ మీడియా ద్వారా ఎన్నో కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు మార్గం ఏర్పడుతోందని, అదే సమయంలో దుర్వినియోగం చేస్తున్నవారు కూడా ఎక్కువ మంది ఉన్నారని పేర్కొన్నారు. స్కూలు ఉపాధ్యాయులు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి జి.జాస్మిన్ (9వ తరగతి), కె.గీతా నాగవైష్ణవి (10వ తరగతి), కె.లహరి (8వ తరగతి)లను మొదటి మూడు స్థానాలకు ఎంపికచేశారు. స్కూలు ఇన్‌ఛార్జి శశిదుర్గా, ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, ఏవో నారాయణమూర్తి తదితరులు పోటీలను పర్యవేక్షించారు.



విజేతలకు ధ్రువపత్రాలు, బహుమతులు అందించిన నిర్వాహకులు



వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు

ప్రైవేట్ ఆసుపత్రులపై ప్రత్యేక నిఘా

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: వైద్య సేవలకు వచ్చేవారికి మెరుగైన చికిత్స అందించాలని జిల్లా ఉప వైద్య, ఆరోగ్య శాఖ అధికారి పి.సరిత సూచించారు. ఏలేశ్వరంలోని పలు ప్రైవేట్ ఆసుపత్రులను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. స్కానింగ్ యంత్రాలు, పలు రకాల పరీక్షలు చేసే పరికరాలు, విభాగాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం చట్ట విరుద్ధమని, ప్రభుత్వ నిబంధనలను తు.చ. తప్పకుండా అన్ని ఆసుపత్రుల యాజమాన్యాలు పాటించి తీరాల్సిందేనని స్పష్టం చేశారు. ఆసుపత్రుల్లో ఎలాంటి అదనపు సౌకర్యాలు కల్పించుకోవాలన్నా తప్పనిసరిగా జిల్లా అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. రోగుల నుంచి అధిక మొత్తంలో సొమ్ము వసూలుచేస్తే చర్యలు తప్పవని చెప్పారు. స్థానికంగా అందిస్తున్న చికిత్సల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు నివేదించాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి శ్రీలక్ష్మి తదితరులు ఉన్నారు.



ప్రైవేట్ ఆసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత

రైల్వే స్టేషన్ ప్రాంగణం.. ప్రమాదాలకు నిలయం

న్యూస్‌టుడే, తుని, తుని పట్టణం: విజయవాడ-విశాఖపట్నం రైల్వే మార్గంలోని తుని రైల్వేస్టేషన్ నిత్యం వందల మంది ప్రయాణికులతో రద్దీగా ఉండే ప్రాంగణం. రోజూ 50కిపైగా రైళ్లు రాకపోకలు సాగిస్తుంటాయి. వాటిలో 6,000 మంది వరకు ఇక్కడి నుంచి వెళుతుంటారు. ఇంతటి ప్రాముఖ్యమైన స్టేషన్ ప్రస్తుతం ప్రమాదకరంగా మారింది. ప్రాంగణంలో నిత్యం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఎంతోకాలంగా రెండు ప్లాట్‌ఫామ్‌లపైనా అవస్థలు, సమస్యలుండడంతో కేంద్ర ప్రభుత్వం పరిష్కరించేందుకు నిధులు మంజూరు చేయడంతో పలు అభివృద్ధి పనులకు ఇటీవల శ్రీకారం చుట్టారు. తాజాగా రెండో నంబరు ప్లాట్‌ఫామ్‌పై విద్యుత్తు పోస్ట్ సర్వ్యూట్‌లో మంటలు చెలరేగడం ప్రయాణికులను భయాందోళనకు గురిచేసింది. పరుగులు తీశారు. ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్ మీదే అభివృద్ధి పనులు జరుగుతుండగా అధికారులు సరైన రక్షణ, పర్యవేక్షణ చర్యలు తీసుకోలేదని పలువురు ఆరోపిస్తున్నారు.

గ్రానైట్ రాళ్లతో..

సుందరీకరణ పనుల్లో భాగంగా స్టేషన్ ముఖద్వారం నుంచి ప్లాట్‌ఫామ్ వరకు కొంతమేర గ్రానైట్ రాళ్లు వేశారు. ఇవి నున్నగా ఉండడంతో ఏమాత్రం తడి ఉన్నా ప్రయాణికులు జారి పడిపోతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వర్షాలతో పలువురు జారి పడుతున్నారు. రైల్వేస్టేషన్‌లో వచ్చిన, దిగుతున్న పలువురు లగేజీతో పాటు కిందపడుతున్నారు. ఇక పిల్లలు, వృద్ధుల పరిస్థితి చెప్పనలవి కాదు. మరోవైపు రిజర్వేషన్ కౌంటర్ల వద్ద సిమెంట్ పలకలు పూర్తిగా వేయకుండా వదిలేశారు. దీనికి తోడు విద్యుత్తు, రైల్వే సిగ్నల్స్‌కు సంబంధించిన పలు రకాల తీగలు పైకి వచ్చాయి. ఫ్లోరింగ్ పనులు పూర్తి కాకపోవడంతో కొన్నిచోట్ల ఎత్తుపల్లాలుగా ఉన్నాయి. వీటిపై పిల్లలు, లగేజీ బ్యాగులతో రైళ్లు ఎక్కడం, దిగడం సాహసంగా మారుతోందని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు పూర్తిగా అందుబాటులో రాలేదు. ఇలా సమస్యలు రాజ్యమేలుతుండగా కోతులు, కుక్కల బెడద తీవ్రంగా ఉంది. ఆయా అంశాలపై రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ రమేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రయాణికుల నిరీక్షణ హాలులో మరుగుదొడ్లు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. మిగిలిన సమస్యల పరిష్కారానికి త్వరితంగా చర్యలు తీసుకుంటామన్నారు.



కౌంటర్ల వద్దకు వెళ్లే మార్గంలో విద్యుత్తు కేబుళ్లు



వర్షాలతో ప్రమాదకరంగా మారిన ఒకటో నంబరు ప్లాట్‌ఫామ్

గుంతల రోడ్లపై దినదిన గండం



చిల్లంగి శివాలయం వద్ద వేలంక మార్గంలో పెద్ద గుంత



గ్రామంలో ప్రమాదపుటంచున ప్రయాణం

కిర్లంపూడి: మండల కేంద్రం నుంచి వేలంక గ్రామం మీదుగా ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి వరకు ఉండే ఆర్అండ్‌బీ పరిధిలోని రోడ్డులో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. చిల్లంగి వేరం టాళ్ల రావిపెద్ద దగ్గర కల్వర్టు నుంచి వేలంక గ్రామం వరకు ఉన్న పంచాయతీ రాజ్ రోడ్డులో అడుగుకో గొయ్యి అన్నట్లు మారింది. పెద్ద పెద్ద గుంతలతో రోడ్డు మొత్తం ప్రమాదాలను ఆహ్వానిస్తోంది. వేలంక నుంచి ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి రోడ్డు మీదుగా ఎర్రవరంలో జాతీయ రహదారిని ఈ మార్గం అనుసంధానం చేస్తోంది. రోడ్డు మొత్తం అయిదు కిలోమీటర్ల మేర పాడైన మార్గంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

నిధులు మంజూరయ్యాయి..

పంచాయతీ రాజ్ శాఖ పరిధిలోని రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సి ఉంది. ప్రస్తుతం రోడ్డు పరిస్థితిపై జిల్లా అధికారులకు నివేదిక అందించాం. ప్రజాప్రతినిధుల చొరవతో త్వరలోనే నిధులు మంజూరు కానున్నాయి. నిధులు సమకూరిన వెంటనే వేలంక రోడ్డుకు శాశ్వత మరమ్మతు పనులు చేపడతాం.

-ఉమాశంకర్, పంచాయతీ రాజ్ డీఈఈ, జగ్గంపేట

కుంగుతున్న రోడ్డుకు రక్షణ చర్యలు

ఈనాడు స్పందన

కిర్లంపూడి, న్యూస్‌టుడే: రాజుపాలెం నుంచి ముక్కొల్లు వెళ్లే రోడ్డులో వాలుకాలువ వంతెన అప్రోచ్ వద్ద ఇటీవల ఏలేరు వరదలకు పడిన గండితో రోడ్డు కుంగిపోయింది. ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. వాహనదారులకు పొంచి ఉన్న ముప్పుపై ఈనెల 15న 'కుంగుతున్న రోడ్డు' శీర్షికన 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించారు. వంతెనకు ముక్కొల్లు గ్రామం వైపు ఉన్న అప్రోచ్ వద్ద పడిన గండితో రోడ్డు ధ్వంసమైన ప్రాంతంలో ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. జల వనరుల శాఖ అధికారుల సూచనలతో ముక్కొల్లు నీటి సంఘం మాజీ అధ్యక్షుడు బస్వా వీరబాబు, సర్పంచి జ్యోతుల రాంబాబు సర్వే కర్రలు పాతించి.. ఇసుక బస్తాలువేసి తాత్కాలికంగా రక్షణ చర్యలు చేపట్టారు.



ముక్కొల్లు రోడ్డులో వేసిన ఇసుక బస్తాలు

అన్నవరం దేవస్థానానికి వెండి శంఖం





శంఖాన్ని అధికారులకు అందిస్తున్న దాత.. వెండి శంఖం

అన్నవరం, న్యూస్‌టుడే: అన్నవరం దేవస్థానానికి ఓ భక్తుడు వెండి శంఖాన్ని శుక్రవారం కానుకగా అందించారు. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన బి.వెంకటరామ నర్సయ్య దాదాపు 337 గ్రాముల వెండితో శంఖాన్ని తయారు చేయించారు. ఆలయానికి విచ్చేసి దేవస్థానం సీనియర్ అసిస్టెంటు రాంబాబుకు అందించారు.

వనదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం

అన్నవరం: అన్నవరం సత్యదేవుని క్షేత్ర రక్షకులుగా కొలిచే వనదుర్గ అమ్మవారి ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా చండీహోమం నిర్వహించారు. వైదిక బృందం ఆధ్వర్యంలో చండీహోమం, పూర్ణాహుతి అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.

గ్రామాల్లో పల్లెపండగ సందడి



సీసీరోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న నాయకులు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చేపట్టిన పల్లెపండగ కార్యక్రమాల సందడి కొనసాగుతోంది. శుక్రవారం మండల పరిధిలోని సుబద్రయ్యమ్మ పేట, లోవకొత్తూరు, ఎస్.అన్నవరం, డి.పోలవరం తదితర గ్రామాల్లో దాదాపు రూ.80 లక్షల వ్యయంతో చేపట్టే సీసీ రహదారుల నిర్మాణానికి ఆయా గ్రామాలకు చెందిన కూటమి నాయకులు శుక్రవారం శంకుస్థాపన పూజలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామాలకు చెందిన తెదేపా నాయకులు పోలిశెట్టి రామలింగేశ్వరరావు, అప్పన రమేష్, దూలం మాణిక్యం, పలకా సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకే ధాన్యం కొనుగోలు

కిర్లంపూడి, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో పండించిన ధాన్యానికి ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేస్తోందని పౌర సరఫరాల శాఖ ఏఎంటీ విజయ్‌కుమార్, కిర్లంపూడి తహసీల్దారు జె.చిరంజీవి తెలిపారు. తక్కువ ధరకు రైతులు ధాన్యం అమ్ముకోకుండా గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులు రైతుల్లో చైతన్యం కల్పించాలని సూచించారు. కిర్లంపూడి ఎంపీపీ కార్యాలయంలో మండల పరిధిలోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నియమించిన సాంకేతిక సిబ్బంది, కస్టోడియన్ అధికారులు, సహాయకులకు శుక్రవారం నిర్వహించిన ఒక రోజు శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. సాధారణ రకం 75 కేజీల బస్తా రూ.1725, గ్రేడ్ ఏ బస్తా రూ.1740 చొప్పున రైతులకు చెల్లిస్తామన్నారు. పలు అంశాలపై తహసీల్దారు చిరంజీవి, మండల వ్యవసాయాధికారి జోకా అమృత, కిషోర్, సురేష్ అవగాహన కల్పించారు.

చికిత్సపొందుతూ ఒకరి మృతి

మసీదుసెంటర్(కాకినాడ): శంఖవరం మండలం అన్నవరానికి చెందిన ఎం.వెంకటరమణ(47) జీజీహెచ్‌లో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందారు. తుని రూరల్ పరిధిలో ద్విచక్రవాహనంపై ఆయన వెళ్తుండగా మరో ద్విచక్రవాహనం ఢీకొట్టింది. తీవ్రగాయాలవ్వడంతో ఆయనను ఈనెల 17న జీజీహెచ్‌లో చేర్చారు. చికిత పొందుతూ మృతిచెందారు. తుని రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్సాహంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుక



కుటుంబ సభ్యులు, నాయకుల సమక్షంలో కేక్ కోస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

గండేపల్లి (జగ్గంపేట) న్యూస్‌టుడే: ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పుట్టినరోజు వేడుక శుక్రవారం జగ్గంపేటలోని రావులమ్మ సెంటర్‌లో ఘనంగా నిర్వహించారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భారీ కేక్‌ను కుటుంబ సభ్యులు, తెదేపా, జనసేన నాయకుల సమక్షంలో నెహ్రూ కోసి అందరికీ పంచారు. పలువురు నాయకులు, అభిమానులు ఆయనకు పుస్తకాలు, మొక్కలు అందించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్, జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, మాజీ ఎమ్మెల్సీలు రెడ్డి సుబ్రహ్మణ్యం, చైతన్యరాజు, గన్ని కృష్ణ, నిమ్మకాయల రంగనాగ్, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనివాసచార్యులు, అధిక సంఖ్యలో కూటమి నాయకులు పాల్గొన్నారు. ● పుట్టినరోజు వేడుకల్లో భాగంగా జనసేన ఇన్‌ఛార్జి తుమ్మలపల్లి రమేష్ ఎమ్మెల్యేకు వెండి కిరీటం, వెండిదండను వేశారు. ● గండేపల్లి మండలం మురారి గ్రామానికి చెందిన తెదేపా నాయకుడు జాస్తి వసంత్ 500 పుస్తకాలు అందించారు.

గౌరీదేవి తరలివచ్చె..



ధర్మవరంలో తరలివస్తున్న దేవతామూర్తులు

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మవరం గ్రామంలో గౌరీదేవిని కొలువుదీర్చే వేడుక శుక్రవారం రాత్రి వైభవంగా సాగింది. గ్రామస్థులు అమ్మవారిని నెత్తినెత్తుకుని ఊరేగించి సీతంపేట రామాలయంలో ప్రతిష్ఠించారు. ఈసందర్భంగా అలివేలు మంగా సమేత వేంకటేశ్వరుడు, ఇతర దేవతామూర్తుల రూపాల్లో కళాకారులు అలరించారు. బాణసంచా కాల్పులు, మేళతాళాలు, పౌరాణిక పాత్రలతో ఊరేగింపు ఆకట్టుకుంది. ఏటా అట్లతద్దెకు గౌరీదేవిని కొలువుదీర్చి కార్తీక పున్నమికి శంకరుని తోడ్కొని వచ్చే వరకు గ్రామంలో పగటి వేషాలుగా పౌరాణిక ప్రదర్శనలు ఏర్పాటుచేస్తారు. సంక్రాంతి నాడు ఉత్సవాలు చేస్తారు. ధర్మవరంలో గౌరీశంకరుల ఉత్సవాలను 88 ఏళ్లుగా నిర్వహిస్తున్నారు.

విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలని ధర్నా

తుని, న్యూస్‌టుడే: తక్షణం విద్యుత్తు ఛార్జీలు తగ్గించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని వీరవరపు పేట విద్యుత్తు ఉపకేంద్రం, కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు నక్కెళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలపై ట్రూ అప్ ఛార్జీల భారం పడకుండా చూడాలని, స్మార్ట్ మీటర్ల విధానం ఉపసంహరించుకోవాలన్నారు. అనంతరం ఏఈ రమణకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో గొర్ల రమణ, నాగేశ్వరరావు, సత్తిబాబు, సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ బృందగాన పోటీలు



విజేతలతో భావిప ప్రతినిధులు

తుని, న్యూస్‌టుడే: భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో జాతీయ బృందగాన పోటీలు శుక్రవారం నిర్వహించారు. బాడవతోటలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో నిర్వహించిన పోటీల్లో 10 పాఠశాలల నుంచి విద్యార్థులు హాజరై ప్రతిభను చాటారు. శ్రీప్రకాష్, లయోలా స్కూలు విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని పరిషత్ అధ్యక్షుడు పి.లక్ష్మణాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో మంతెన సూర్యనారాయణరాజు, వి.ఎస్.ఆర్. ఆంజనేయప్రసాద్, వరహాలబాబు, ఆసిన సత్యనారాయణ, గౌరీ శంకర్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి పెట్టండి

తుని గ్రామీణం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి అశోక్‌కుమార్ సూచించారు. మండలంలోని డి.పోలవరంలో శుక్రవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఆయన రైతులతో మాట్లాడారు. రసాయన ఎరువులకు బదులు సేంద్రియ ఎరువులు వినియోగించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం తొలగింపు

తుని: పట్టణంలోని వీరవరపుపేటకు చెందిన అక్రమ కట్టడంపై కోర్టులో ఉన్న వ్యవహారం కొలిక్కివచ్చింది. హైకోర్టు ఆదేశాలతో పురపాలక, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో అక్రమ నిర్మాణాన్ని తొలగించారు. కొద్దిరోజులుగా నిర్మాణం కూల్చివేతలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో పోలీసులు మోహరించారు. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, పట్టణ, గ్రామీణ సీఐలు గీతారామకృష్ణ, చెన్న కేశవరావు, తహసీల్దారు ప్రసాద్, పలువురు ఎస్సైలు, సిబ్బంది కూల్చివేత ప్రక్రియను పర్యవేక్షించారు. కోర్టు ఆదేశాలతోనే నిర్మాణాన్ని తొలగించామని, ఇంటి యజమాని వద్ద ఎలాంటి స్టేలేదని పురపాలక కమిషనర్ ఎ.వెంకట్రావు చెప్పారు.



గుంతల పూడ్చివేత

మండలంలోని డి.పోలవరం ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలను కూటమి నాయకులు శుక్రవారం పూడ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. సిమ్మెంట్, కాంక్రీట్ బూడిదతో గుంతలను పూడ్చి రహదారికి మరమ్మతులు చేపట్టారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం